జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | మంగళవారం 17 నవంబర్ 2026 | సంపుటి : 17 | సంచిక : 114 | పేజీలు : 8 | వెల : 1/-

RNI NO.APTEL/2010/36516



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, విలేఖరుల ఇంచార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

94402 31967

శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం : జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, సూర్య చంద్రుల సమయాలు సూర్యోదయం : 5:28 , సూర్యాస్తమయం : 6:32 , చంద్రోదయం : 3:38 చంద్రాస్తమయం : 3:07 పంచాంగం, తిథి : శుద్ధ ద్వాదశి రా. 10:31 వరకు, తర్వాత త్రయోదశి, నక్షత్రం: విశాఖ రా. 8:10 వరకు, తర్వాత అనూరాధ, యోగం : సిద్ధం మ. 1:19 వరకు, తర్వాత సాధ్యం, కరణం: బవ ఉ. 9:47 వరకు, తర్వాత బాలవ రా. 10:31 వరకు, తర్వాత కౌలవ

Published From RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail : prajajyothidaily@gmail.com



అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

6 సంవత్సరాల కొత్త పెన్షన్ల మంజూరు.. కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదలకు భరోసా

నూతన చేయూత పెన్షన్ పత్రాలు పంపిణీ చేసిన 12వ వార్డు కౌన్సిలర్ అవురం విక్రమ్ రెడ్డి

మొయినాబాద్: నవంబర్ 16 (ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలకు నూతన పెన్షన్లు మంజూరు చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని 12వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు అవురం విక్రమ్ రెడ్డి అన్నారు. నూతన చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అవురం విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ... గత దాదాపు ఆరు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఒక్కరికీ కూడా నూతన పెన్షన్లు మంజూరు కాలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్లు అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ప్రజల కష్టాలను గుర్తించి, వారి అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని, ప్రతి నెలా అందే పెన్షన్‌తో వారి జీవనానికి ఆర్థిక భరోసా లభిస్తుందని అన్నారు.

10

అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు అందించడమే

కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

మొయినాబాద్ మున్సిపాలిటీ, మండల గ్రామాల లబ్ధిదారులకు కార్డుల అందజేత

మొయినాబాద్: నవంబర్ 16 (ప్రజా జ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు మొయినాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని ప్రతి గ్రామం నుంచి ఐదుగురు లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిత్యావసర సరుకులు మరింత పారదర్శకంగా అందే అవకాశం ఉంటుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. డిజిటల్ విధానం ద్వారా రేషన్ కార్డుల నిర్వహణ సులభతరం కావడంతో పాటు లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందుతాయని తెలిపారు.

వివరాలు 10

పిగ్లిపూర్ సర్వే నంబర్ 17లో భూ అక్రమాలపై విచారణ జరపాలి

386 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూముల గుర్తింపు..

ఉన్నతాధికారులకు కోట ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు





అయ్యప్ప మాలధారణతో వస్తే స్కూల్లోకి అనుమతి లేదా?

సెయింట్ మార్టిన్ స్కూల్ యాజమాన్యంపై ఏబీవీపీ ఆగ్రహం.. పాఠశాల ఎదుట ధర్నా!

8



తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

భారత్ సమ్మిట్‌లో ఇటలీ నేత వ్యాఖ్యలపై శంషాబాద్ ఎయిర్పోర్ట్ వద్ద ఉన్న ఎఫ్ఆర్ఆర్ఓ కార్యాలయంలో బీజేపీ ఫిర్యాదు

ఫిలిబెక్ వీసా, పర్యటన ఉద్దేశంపై సమగ్ర విచారణ జరపాలి

రాజేంద్రనగర్, నవంబర్ 16 (ప్రజా జ్యోతి) ఫిలిబెక్ వీసా, పర్యటన ఉద్దేశంపై సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్ వేదికగా 14 తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన 'భారత్ సమ్మిట్ 2026'లో మన దేశానికి వ్యతిరేకంగా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన విదేశీ రాజకీయ ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శంషాబాద్‌లోని ఎఫ్ఆర్ఆర్ఓ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాంచందర్ రావు. ఈ వ్యవహారంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు నేతృత్వంలో బీజేపీ నాయకులు శంషాబాద్‌లోని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) అధికారులకు ఫిర్యాదు చేశారు. భారత్ సమ్మిట్ సందర్భంగా 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' వంటి నినాదాలతో భారత అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకున్నారంటూ ఫిలిబెక్‌పై బీజేపీ నాయకులు ఆరోపించారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు



కొత్తూరు సీఐ నాగార్జున రెడ్డి ఈగల్ టీమ్,డాగ్ స్క్వాడ్ బృందాలతో కమల ఫుడ్ కంపెనీ, కరాచీ,సుప్రీం పైప్ కంపెనీలో పోలీసులు తనిఖీలు

సూర్య భగవానుడికి కృతజ్ఞత చెప్పే అతి పవిత్రమైన పూజ 'ఛత్ పూజ'

షష్టి దేవి యొక్క దయ అందరిపై ఉండాలి

కొత్తూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్

కొత్తూరు మున్సిపాలిటీ లో ఘనంగా 'ఛత్ పూజ' నిర్వహణ

కొత్తూరు నవంబర్ 16 (ప్రజా జ్యోతి) కొత్తూరు మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో పలు ఉత్తర భారత దేశానికి సంబంధించిన భక్తులు ఛత్ పూజ ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై సుదర్శన్ గౌడ్ ప్రసంగిస్తూ..ఉత్తర భారత దేశంలో అతి పవిత్రంగా నిర్వహించే 'ఛత్ పూజ' అనేది జీవరాశి మనుగడకు, ఆరోగ్యానికి, పంటలకు మూలకారణ మైన సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు నిర్వహిస్తారని సుదర్శన్ గౌడ్ అన్నారు. అదేవిధంగా పిల్లలను రక్షించే దేవిగా సూర్య భగవానుని సోదరి అయినా షష్టి దేవిని పూజిస్తారని, అదేవిధంగా పిల్లల ఆయురారోగ్యాలు బాగుండాలని షష్టి దేవి వ్రతాన్ని పాటిస్తారు అని అన్నారు,నాలుగు రోజులపాటు ఉపవాసాలు ఉంటూ నిర్వహించే భక్తులకు ఆ సూర్యభగవానుడి మరియు షష్టి దేవి యొక్క దయ ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.ఈ పూజలో పాల్గొన్న వారిలో మాజీ వార్డ్ సభ్యులు పెద్దిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,అంజనేయులు గౌడ్,చింత సాయి తేజశ్వర్,నరసింహ గౌడ్,ఉదయ్ శంకర్,విశాల్ గౌడ్,దుర్గేష్ ,అనుఫ్ రాహుల్,నవనీత్ పలువురు భక్తులు పాల్గొన్నారు.



జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై వివేకానంద నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జలమండలి అధికారులు డైరెక్టర్ ఆపరేషన్ రాజశేఖర్, సిజిఎం శ్రీనివాస్ రెడ్డి, జిఎం కృష్ణ, డీజీఎం నారాయణ తో సమీక్షా సమావేశం జరిపిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ...మంచి నీటి వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ, పనితీరు పై అధికారులతో చర్చించడం జరిగినది.ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే విధంగా జలమండలి అధికారులు సమన్వయంతో పని చేయాలని, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల వాసుల నుండి వచ్చిన వినతి పత్రాలను పరిగణలోకి తీసుకొని అత్యవసర పనుల పై తక్షణమే స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని,ప్రతి ఫిర్యాదు పై స్పందించాలని,ప్రజలకు జవాబుదారీతనంగా ఉండలని,ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేయాలని,ప్రజలకు ఎల్లవేళలో అందుబాటులో అధికారులు ఉండలని పిఎసి చైర్మన్ గాంధీ తెలియచేసారు.



ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా లో అంతరాయం లేకుండా చూడలని, ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీరు అందించాలని,కలుషితం కలుగకుండా చూడలని, స్వచ్ఛమైన త్రాగు నీరు అందించాలని, మంచి నీటి సరఫరా లో ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు పిఎసి చైర్మన్ గాంధీ తెలియచేసారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమగ్ర , సంతులిత అభివృద్ధి లో భాగంగా ప్రతి డివిజన్ల లో మౌళికవసతుల కల్పన కొరకై ప్రతి డివిజన్ లో అవసరమైన ప్రతిపాదనలు తీసుకోవడం జరిగినది అని, కాలనీలలో అవసరమైన చోట యుజిడి పైప్ లైన్, మంచి నీటి పైప్ లైన్ పనుల కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పనులు త్వరిత గతిన చేపట్టాలని, అత్యవసర పనుల ను గుర్తించి,ప్రథమ ప్రాధాన్యత గా పనులు గుర్తించి త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలియచేసిన పిఎసి చైర్మన్ గాంధీ అదేవిధంగా అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని,అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతి పై సమీక్షా జరపడం జరిగినది.అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పిఎసి చైర్మన్ గాంధీ తెలియచేసారు.

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 21 రోజుల సైక్లింగ్ యాత్ర



దేశభక్తి, ఆరోగ్యం, డ్రగ్స్ రహిత భారత్ మా లక్ష్యం

ఉప్పల్, నవంబర్ 16,(ప్రజాజ్యోతి) దేశభక్తి, ఆరోగ్యంపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ (హెచ్ సి జి) ఆధ్వర్యంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైక్లింగ్ యాత్ర నిర్వహించనున్నారు.
నవంబర్ 19న కాశ్మీర్‌లో ప్రారంభం కానున్న ఈ యాత్రలో తొమ్మిది మంది సైక్లిస్టులు పాల్గొని, 21 రోజుల పాటు సుమారు దేశమంతటా ప్రయాణించి కన్యాకుమారికి చేరుకోనున్నారు. హైదరాబాద్ సైకిలింగ్ గ్రూప్ మార్గదర్శకులు రవీందర్ నందనూరి నేతృత్వంలో ఇప్పటికే మూడు విజయవంతమైన ఎడిషన్లు నిర్వహించగా, ఇది నాలుగో ఎడిషన్ కావడం విశేషం.
ఈ యాత్రలో పాల్గొంటున్న వారు:
1 గడ్డం మల్లేష్ -- ఇన్‌స్పెక్టర్, ఈగల్ ఫోర్స్
2.డాక్టర్ శ్రీకాంత్ పిల్లి -- హోమియోపతి వైద్యుడు
3.రఘురామ్ -- హైకోర్టు న్యాయవాది
4.శ్రీమతి సెల్వి -- ఆర్మీ స్కూల్ ఉపాధ్యాయురాలు
5.శ్రీనివాస్ గౌడ్ -- ఫార్మా రంగం
6.ఉమా మహేశ్వర రావు- ఎలెక్ట్రానిక్ రంగం
7.శ్రీధర్ - ఐటీ
8.మను
9.రవీందర్ నందనూరి -- ఎజ+ మార్గదర్శకులు
సపోర్టింగ్ టీమ్ - సుందర్ సింగ్ రాజపుత్ ,మహ్మద్ అక్రమ్ , కానన్ , గణేష్.
భారత సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు నివాళులర్పించడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం.
అదేవిధంగా, భారత ప్రభుత్వ 'నషా ముక్త్ భారత్ అభియాన్' లో భాగంగా యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ, "డ్రగ్స్‌కు నో చెప్పండి -- ఆరోగ్యానికి, క్రీడలకు, మంచి భవిష్యత్తుకు యస్ చెప్పండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు.
సైక్లింగ్ ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఈ బృందం పిలుపునిస్తోంది.
"మా ప్రయాణం సైక్లింగ్ కోసం మాత్రమే కాదు... వీర జవాన్లకు నివాళి, యువతకు స్ఫూర్తి, డ్రగ్స్ రహిత భారతదేశం కోసం మా సంకల్పం!"
అనే నినాదంతో ఈ తొమ్మిది మంది తమ సాహస యాత్రను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు నేమూరి మహేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంప కృష్ణ, ఎంకిరాల నర్సింహా, యాదగిరి, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు

కంటి చూపు మందగించిన వారికి కొండంత అండగా --లయన్స్ క్లబ్

ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి:

లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ నటరాజ్ బ. యాదయ్య గుప్త



ప్రజాజ్యోతి,ఆమనగల్లు, నవంబర్ 16::-కంటి చూపు మందగించిన పేదలు, వృద్ధులకు లయన్స్ క్లబ్ అండగా నిలుస్తూ ఉచిత వైద్య సేవలు అందిస్తోందని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ లయన్ నటరాజ్ బి. యాదయ్య గుప్త అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రామ్ రెడ్డి లయన్స్ ఐ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని రామ్ రెడ్డి లయన్స్ విజన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు ఉచిత వైద్య పరీక్షలు, అవసరమైన శస్త్రచికిత్సలు అందించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కళ్ల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా చూపులేని వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన వారవుతారని, ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.శిబిరంలో కంటి వైద్యులు ఎం. చంద్రశేఖర్ మొత్తం 52 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18 మందికి కంటిశుక్లం శస్త్రచికిత్స (ఐఓఎల్) అవసరమని గుర్తించి, తదుపరి చికిత్స నిమిత్తం రామ్ రెడ్డి లయన్స్ ఐ ఆసుపత్రికి తరలించినట్లు క్లబ్ పీఆర్వో పాషా తెలిపారు.
ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, కార్యదర్శి గంగుల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి గంప శ్రీనివాస్, క్లబ్ సభ్యులు మోహన్ రెడ్డి, ఏలే శివకుమార్, ఆసుపత్రి సిబ్బంది శిరీష తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల విభాగం జిల్లా కో-కన్వీనర్‌గా కొండాపురం నేపాల్ రెడ్డి

ఎల్బీనగర్ నవంబర్ 16 (ప్రజా జ్యోతి) ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన కొండాపురం నేపాల్ రెడ్డిని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా దివ్యాంగుల విభాగం కో-కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతానికి, అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



కృష్ణవేణి మృతి పట్ల గద్దె విజయ్ నేత సంతాపం



ఎల్బీనగర్ నవంబర్ 16 (ప్రజాజ్యోతి) వనస్థలిపురం మార్కండేయ స్వామి దేవాలయం, వనస్థలిపురం హాస్టల్ భవన వ్యవస్థాపకులు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మన్య సత్యనారాయణ సతీమణి మన్య కృష్ణవేణి (10-11-2026) మృతి పట్ల మల్కాజిగిరి టీడీపీ కమిటీ సభ్యుడు, బి.ఎన్.రెడ్డి టీడీపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ గద్దె విజయ్ నేత సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన ఆయన మన్య సత్యనారాయణ నివాసానికి వెళ్లి కృష్ణవేణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె తనకు తల్లితో సమానమని, ఆమె మృతి తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎల్.బి.నగర్ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో నిర్మించిన పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్ నవంబర్ 16 (ప్రజా జ్యోతి) ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్-1, విశ్వేశ్వరయ్య కాలనీలకు సంయుక్తంగా దాదాపు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన సుందరమైన పార్కును ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్ల క్రితమే శంకుస్థాపన చేసినప్పటికీ న్యాయపరమైన అడ్డంకులతో పనులు నిలిచిపోయాయని, చివరకు అడ్డంకులను అధిగమించి పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హస్తినాపురం మాజీ కార్పొరేటర్ పద్మ శ్రీనివాస్ నాయక్, డివిజన్ అధ్యక్షుడు సత్యం చారి, కాలనీవాసులు భూపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, యాదగిరి, కరుణాకర్, ప్రతాప్, ప్రసాద్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, అమర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ 'ప్రతి ఇంటా ఉసిరి, ప్రతి గుడిలో బిల్వం' కార్యక్రమం

నాచారం నల్ల పోచమ్మ దేవాలయంలో ఉసిరి, బిల్వం మొక్కలు నాటిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, నవంబర్ 16, (ప్రజాజ్యోతి): పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు, మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ సంకల్పించిన 'ప్రతి ఇంటా ఉసిరి -- ప్రతి గుడిలో బిల్వం' కార్యక్రమంలో భాగంగా నాచారం నల్ల పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమం లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర కో అడ్వైటర్ నుతికడి బోజనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం ప్రధాన ఉద్దేశాన్ని వివరిస్తూ, ప్రతి ఇంట్లో, ప్రతి ఆలయంలో, ప్రతి పాఠశాలలో ఉసిరి, బిల్వం మొక్కలను నాటి వాటిని సంరక్షించేలా ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ హరిత సంకల్పం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.భక్తి భావాన్ని ప్రకృతి పరిరక్షణతో మేళవిస్తూ, మన సనాతన సంప్రదాయాల్లో విశిష్ట స్థానం కలిగిన ఉసిరి, బిల్వ వృక్ష సంపదను భావితరాలకు





అందించాలనే గొప్ప ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.కార్తీకమాసంలో ఉసిరి చెట్టుకు, బిల్వ వృక్షానికి ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని, వీటి ద్వారా ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యతకు కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉసిరి, బిల్వం మొక్కలను వివిధ గ్రామాలకు పంపిణీ చేసి, ప్రజలను మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణలో భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని తమ బాధ్యతగా భావించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని, పర్యావరణ హితమైన భవిష్యత్తును నిర్మించవచ్చని పేర్కొన్నారు.

పిగ్లిపూర్ సర్వే నంబర్ 17లో భూ అక్రమాలపై విచారణ జరపాలి

386 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూముల గుర్తింపు.. ఉన్నతాధికారులకు కోట ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు

అబ్దుల్లాపూర్ మెట్టు/ నవంబర్ 16 (ప్రజాజ్యోతి) రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం పరిధిలోని పిగ్లిపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 17లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డిఓ కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 17లో మొత్తం 386 ఎకరాల 15 గుంటల భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ భూముల్లో ప్రభుత్వ భూములు, బూదాన్ భూములు, సీలింగ్ భూములు ఉన్నాయని, వాటిని గుర్తించి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని కోరారు.

భూముల విభజనపై వివరాలు..

సర్వే నంబర్ 17/1/2/0లో 75 ఎకరాల భూమి బూదాన్ యజ్ఞ బోర్డుకు చెందినదిగా, 17/2లో 61 ఎకరాలు ఖిరీజ్ ఖాతా ప్రభుత్వ భూమిగా, 17/3 నుంచి 17/18 వరకు 53 ఎకరాలు సీలింగ్ ప్రభుత్వ భూములుగా, మిగిలిన 197 ఎకరాల 15 గుంటలను మిగిలిన పట్టా భూములుగా వినతిపత్రంలో వివరించారు. ఈ భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని కోరారు.

అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి..

తహసీల్దార్ కార్యాలయం నుంచి 17-02-2025న జారీ చేసిన లేఖ నంబర్ డీ/143/2024లో సర్వే నంబర్ 17లోని కొన్ని భూములను బూదాన్ భూములుగా గుర్తించినట్లు



వినతిపత్రంలో ప్రస్తావించారు. అయితే సర్వే నంబర్ 17లోని ప్రభుత్వ, బూదాన్, సీలింగ్ భూములను పూర్తిస్థాయిలో గుర్తించి, వాటి సరిహద్దులను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, భూ బకాసురుల నుంచి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. గుర్తించిన భూములను గ్రామ ప్రజల ప్రయోజనాల కోసం పర్యాటక అభివృద్ధి దిశగా వినియోగించడంతో పాటు, అవసరమైతే ప్రభుత్వ శాఖల అధికారుల నివాస గృహాల నిర్మాణానికి కేటాయించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. గ్రామ ప్రజల ప్రయోజనాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ దృష్ట్యా ఈ వినతిపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి కోరారు.

మీ ఎయిర్‌టెల్ కనెక్షన్‌తో మరిన్ని ప్రయోజనాలు:

30,000కు పైగా విలువైన ఎయిర్‌టెల్ ఇన్‌సైడర్ రివార్డ్స్‌ను పొందండి

శేరిలింగంపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి): ప్రీమియం సబ్‌స్క్రిప్షన్లు, షాపింగ్ డీల్స్ నుంచి ప్రయాణాలు, డైనింగ్, వినోదం వరకు ప్రముఖ బ్రాండ్ల ఆఫర్లన్నింటినీ ఎయిర్‌టెల్ ఇన్‌సైడర్ ఒకే వేదికపై అందిస్తోంది.మీ ఎయిర్‌టెల్ కనెక్షన్ కేవలం కమ్యూనికేషన్ సేవలకే పరిమితం కాదు. ఎయిర్‌టెల్ కస్టమర్‌గా ఉండటం ద్వారా మరిన్ని ప్రయోజనాలను కూడా పొందవచ్చు.ఎయిర్‌టెల్ ఇన్‌సైడర్ ద్వారా కస్టమర్లు తమ రోజువారీ జీవితంలో వినియోగించుకోగలిగే ప్రముఖ బ్రాండ్లు, విభిన్న అనుభవాలకు సంబంధించిన ?30,000కు పైగా విలువైన రివార్డులు, ప్రత్యేక ఆఫర్లను పొందే అవకాశం ఉంది.ఎయిర్‌టెల్ ఇన్‌సైడర్ వెనుక ఉన్న ఆలోచన చాలా సులభం: కేవలం కనెక్టివిటీని అందించడమే కాకుండా, ఎయిర్‌టెల్ కస్టమర్‌గా ఉండటం ద్వారా అదనపు ప్రయోజనాలు కూడా లభించాలి.డుయోలింగో ద్వారా కొత్త భాషను నేర్చుకోవడం, క్రోమా లో గ్యాడ్జెట్లు కొనుగోలు చేయడం,సినీపోలిస్ లో సినిమా చూడటం, పాకెట్ ఎఫ్‌ఎం లో సంగీతం, ఇతర వినోద కార్యక్రమాలను ఆస్వాదించడం వంటి ఎన్నో ప్రయోజనాలను కస్టమర్లు తమ ఆసక్తులు, అవసరాలకు అనుగుణంగా ఎంచుకోవచ్చు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని ఆఫర్లను రిడీమ్ చేసుకోవడం ద్వారా కస్టమర్లు ?30,000కు పైగా విలువైన ప్రయోజనాలను పొందవచ్చు. కొత్త విషయాలను నేర్చుకోవడం, గ్యాడ్జెట్లను అప్‌గ్రేడ్ చేసుకోవడం, తదుపరి విహారయాత్రకు ప్రణాళికలు రూపొందించుకోవడం లేదా బయటకు వెళ్లి భోజనాన్ని ఆస్వాదించడం వంటి రోజువారీ అవసరాలకు ఖర్చు చేసే మొత్తంపై మరింత విలువను పొందేందుకు ఎయిర్‌టెల్ ఇన్‌సైడర్ అనేక అవకాశాలను అందిస్తోంది.

గతంలోనూ ఎయిర్‌టెల్ ఇన్‌సైడర్ లింక్డ్‌ఇన్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్లు,ఈజీడైనర్,మేక్‌మైట్రిప్, మెంబర్‌షిప్‌ల వంటి ప్రయోజనాలను అందించేందుకు ప్రముఖ బ్రాండ్లతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంది. రానున్న రోజుల్లో మరిన్ని ప్రముఖ బ్రాండ్లు, ప్రత్యేక ఆఫర్లను ఈ వేదికపైకి తీసుకురావడం ద్వారా కస్టమర్లకు విస్తృత శ్రేణి ప్రయోజనాలను అందించనుంది.కస్టమర్లతో తన అనుబంధానికి మరింత



విలువను జోడించడంలో భాగంగా ఎయిర్‌టెల్ చేపడుతున్న మరో ప్రయత్నమే ఎయిర్‌టెల్ ఇన్‌సైడర్. తద్వారా ఎయిర్‌టెల్‌తో అనుబంధం కేవలం కనెక్టివిటీకి మాత్రమే పరిమితం కాకుండా,అనేక విధాలుగా మరింత ప్రయోజనకరంగా మారనుంది.

హనోక్ ఆనంద్‌కు అంబేద్కర్ జాతీయ పురస్కారం

న్యూఢిల్లీలో ఘనంగా అవార్డు ప్రదానం

చేవెళ్ల నవంబర్ 16(ప్రజా జ్యోతి): దేశ రాజధాని న్యూఢిల్లీలో చేవెళ్ల మున్సిపాలిటీకి చెందిన హనోక్ ఆనంద్ అంబేద్కర్ జాతీయ అవార్డును అందుకున్నారు. కరోల్‌బాగ్‌లో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 20వ జాతీయ సదస్సులో ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే విశేష్ రవిజీ, సమాచార కమిషనర్ సుధారాణి చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సమాజ సేవకు అంకితమై, సామాజిక అభ్యున్నతి కోసం నిరంతరం కృషి




చేస్తున్న వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించడమే ఈ జాతీయ పురస్కారాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అవార్డు అందుకున్న హనోక్ ఆనంద్ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలే తనకు స్ఫూర్తి అని, సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మరింత బాధ్యతతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఏ రాష్ట్ర నాయకులు కోటేశ్వరరావు, విజయ్ కుమార్, విష్ణువర్ధన్, ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, అవార్డుల కమిటీ రంగారెడ్డి జిల్లా సభ్యుడు చొక్కంపేట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లి వీకర్ సెక్షన్ తండా శ్మశానవాటికల్లో పనులను వెంటనే పూర్తి చేయాలి

మరోసారి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన రాగం హరి శంకర్ యాదవ్





శేరిలింగంపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి): నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి విలేజ్, వీకర్ సెక్షన్,తండా శ్మశానవాటికల్లో వీధి దీపాలు, రహదారులు,భద్రత, నీటి సదుపాయాలు తదితర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను శంకరి రాజు ముదిరాజ్,గ్రామస్థులు నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాగం హరి శంకర్ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు.దీంతో గతంలో ఈ సమస్యల పరిష్కారం కోసం రాగం హరి శంకర్ యాదవ్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన అధికారులు కొన్ని పనులను ప్రారంభించినప్పటికీ, మరికొన్ని పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.ఈ నేపథ్యంలో మరోసారి ప్రజల సమస్యలపై స్పందించిన రాగం హరి శంకర్ యాదవ్ ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్ కి మరోసారి వినతిపత్రం సమర్పించి,శ్మశానవాటికల్లో పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.దీనిపై జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్ సానుకూలంగా స్పందిస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాజు ముదిరాజ్, పరమేష్,శ్రీకాంత్, నరేష్,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ జి సృజన

ప్రజలతో నేరుగా ముఖాముఖి సమస్యల పరిష్కారంపై సమీక్ష





శేరిలింగంపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ గారు వివిధ శాఖల అధిపతులతో కలిసి పాల్గొని,ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు,ఫిర్యాదులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 32 ఫిర్యాదులు అందాయి. వాటి వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

- టౌన్ ప్లానింగ్: 26,- ఇంజినీరింగ్:3,- శానిటేషన్: 2,- ఎలక్ట్రికల్: 1,ప్రతి ఫిర్యాదును ప్రత్యేకమైన గ్రీవెన్స్ ఐడీ ట్రాకింగ్ లింక్‌తో నమోదు చేయడం జరిగింది. తద్వారా ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదుల స్థితిగతులను, పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం కల్పించబడింది.ఈ సందర్భంగా కమిషనర్ సంబంధిత శాఖల అధిపతులు ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి,అవసరమైన చర్యలు చేపట్టి, నిర్దేశించిన గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందిస్తూ, సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను అమలు చేయాలని అధికారులకు సూచించారు.

రామంతపూర్ డివిజన్‌లో అత్యంత వైభవంగా ఛత్ పూజ వేడుకలో డివిజన్ అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా గారు పాల్గొన్నారు





రామంతపూర్ లోని చిన్న చెరువు వద్ద ఉత్తర భారతదేశ ప్రజల అత్యంత పవిత్రమైన వేడుక ఛత్ పూజ ఆధ్యాత్మిక శోభతో, అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. ఉపాధి మరియు వృత్తి రీత్యా హైదరాబాద్‌కు విచ్చేసి, రామంతపూర్ పరిసర ప్రాంతాల్లో స్థిరపడిన బీహార్, రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు ఈ వేడుకల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.సూర్య భగవానుడిని మరియు ఛఠీ మయ్యాను ఆరాధిస్తూ నిర్వహించే ఈ కఠినమైన వ్రతంలో భాగంగా, భక్తులు కుటుంబ సమేతంగా చిన్న చెరువు తీరానికి చేరుకుని పవిత్ర స్నానాలు ఆచరించారు. అస్తమిస్తున్న సూర్యుడికి మరియు ఉదయించే సూర్యుడికి భక్తితో 'అర్ఘ్యం' సమర్పిస్తూ, తమ కుటుంబాల శ్రేయస్సు, ఆయురారోగ్యాలు మరియు సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువు పరిసరాలన్నీ భక్తుల జయజయధ్వానాలు, సాంప్రదాయ గీతాలు మరియు దీపాల కాంతులతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపించాయి. ఈ చెత్ పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రామంతపూర్ డివిజన్ అధ్యక్షులు వంగాల. సంతోష్ గుప్తా గారు మరియు బిహారి సంఘ సభ్యులు అలాగే బిజెపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

హైదరాబాద్‌లో చేయూత పింఛన్లు మంజూరు

హైదరాబాద్, నవంబర్ 16 (ప్రజా జ్యోతి) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని తిరుమలగిరి, మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ మండలాలకు చెందిన 1,459 మందికి మంజూరైన చేయూత పింఛన్ల ప్రతులను ఆదివారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, స్థానిక ఎమ్మెల్యే గణేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మొత్తం పింఛన్లలో 1,092 వితంతు, 217 దివ్యాంగుల, 150 ఒంటరి మహిళల పింఛన్లు ఉన్నాయని తెలిపారు. మండలాల వారీగా తిరుమలగిరిలో 833, మారేడ్‌పల్లిలో 161, సికింద్రాబాద్‌లో 465 మందికి పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. అర్హత ఉండి దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి మరో అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ కోరగా, పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు భానుక నర్మద, ఆర్డీఓ సాయిరాం, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ చేయూత!

ఎమ్మెల్యే కాలే యాదయ్య

43 మందికి రూ.18.95 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు

కొత్త పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ





చేవెళ్ల, నవంబర్ 16 (ప్రజా జ్యోతి): పేదల సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. సోమవారం చేవెళ్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బన్సీలాల్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్షించారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చేవెళ్ల మండలం, మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లతోపాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 18.95 లక్షల విలువైన చెక్కులను 43 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసి ఆర్థిక భరోసా కల్పించారు. అనంతరం మొయినాబాద్‌లోని అంజనాదేవి గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మొయినాబాద్ మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పేదల సంక్షేమ పథకాల అమలులో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పార్థసింహారెడ్డి, మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఎమ్మార్వో కృష్ణయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమత వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో బీజేవైఎం నూతన కార్యవర్గం ఎన్నిక



తలకొండపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి) తలకొండపల్లి మండల భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) నూతన కార్యవర్గాన్ని మండల అధ్యక్షుడు ఈసరి బాలకృష్ణ ముదిరాజు సోమవారం ప్రకటించారు.మండలంలోని అన్ని గ్రామాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ,యువకులకు పెద్దపీట వేస్తూ కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో,యువత సమస్యల పరిష్కారంలో బీజేవైఎం కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.మండలంలో పార్టీని గ్రామగ్రామాన బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.నూతన కార్యవర్గం సమిష్టిగా పనిచేసి యువతను చైతన్యవంతం చేయాలని సూచించారు.మండల ఉపాధ్యక్షులుగా కమటం భరత్ (వెంకట్రావుపేట),మూడవత్ నవీన్ (వెంకటాపూర్ తండా),నిదురం నరేష్ యాదవ్ (చంద్రధన),తల్లోజ్ మనీష్ చారి (చుక్కాపూర్),సడమోని శ్రీశైలం యాదవ్ (అంతారం),శానమోని విష్ణు (మెదక్ పల్లి) నియమితులయ్యారు.జనరల్ సెక్రెటరీలుగా జర్పుల శ్రీకాంత్ (ఆర్లకుంట తండా),సప్పిడి నవీన్ (రాంపూర్),కట్టుమల విజయ్ (తలకొండపల్లి) ఎంపికయ్యారు.అలాగే కార్యదర్శులుగా వడ్డే శివ (అంతారం),జర్పులావత్ శివ (సూర్య నాయక్ తండ),జిసుకుంట్ల గణేష్ గౌడ్ (పెద్దూర్) నియమితులయ్యారు. కోశాధికారిగా బురమోని గణేష్ (తలకొండపల్లి) ఎంపికయ్యారు.మండల కార్యవర్గ సభ్యులుగా రొయ్యల మహేష్ (రాంపూర్),పులిజాల శివ (పెద్దూర్),నూకం శివ (తలకొండపల్లి), అజయ్ (జూలపల్లి) నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

సీఎం సోదరుడు తిరుపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గుజ్జుల మహేష్

తలకొండపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్



రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డిని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.వారి స్వగృహంలో కలిసి శాలువాతో సన్మానించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మండలంలోని పలు అభివృద్ధి పనులు,ప్రజా సమస్యలు,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది.మండల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని,పెండింగ్ లో ఉన్న రోడ్లు,తాగునీరు,విద్య,వైద్య సదుపాయాలపై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా గుజ్జుల మహేష్ విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.తలకొండపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరూ సమిష్టిగా కృషి చేయాలని తిరుపతి రెడ్డి సూచించినట్లు తెలిసింది.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మీనాక్షి ఎంటర్ప్రైజెస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు మల్లాపూర్ తాండ గ్రామస్తుల వినతిపత్రం

పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు



కొత్తూరు నవంబర్ 16 (ప్రజా జ్యోతి) కొత్తూరు మండలంలోని మల్లాపూర్ తాండ గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న మీనాక్షి ఎంటర్ప్రైజెస్ ప్లాస్టిక్ కంపెనీపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తేలితే వెంటనే కంపెనీని సీజ్ చేయాలని కోరుతూ గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు కంపెనీ వల్ల ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కంపెనీ కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.దీనిపై ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ సానుకూలంగా స్పందించారు. వెంటనే కొత్తూరు మండల ఎంఆర్ఓతో పాటు షాద్‌నగర్ వ్యవసాయ శాఖ అధికారులకు దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. కంపెనీకి సంబంధించిన అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి, విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుజాత శ్రీనివాస్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ తాలూకా అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, వార్డు సభ్యులు శంకర్ నాయక్, సునీతా మహేందర్ నాయక్, అంజలి నారాయణ మరియు గ్రామ పెద్దలు గోపాల్ నాయక్, బిక్య నాయక్, రెడ్యా నాయక్, రాము నాయక్, దసరత్ నాయక్, పీరియా నాయక్, రాజు నాయక్, సోమ్లా నాయక్, చిన్నా నాయక్, సంతోష్ నాయక్, విష్ణు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మొదటి సోమవారం వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు

బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న జంపన ప్రతాప్ దంపతులు



బోయిన్ పల్లి, నవంబర్ 16.(ప్రజా జ్యోతి):కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా బొంతపల్లిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ జంపన ప్రతాప్, జంపన విద్యావతి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేక కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.అనంతరం జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. స్వయంభువుగా వెలసిన వీరభద్ర స్వామివారిని దర్శించుకుని అభిషేక పూజల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని పరమశివుడిని ప్రార్థించినట్లు తెలిపారు.కార్తీక మాసంలో శివుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే భగవంతుని అనుగ్రహం లభిస్తుందని, భక్తుల కోరికలు నెరవేరి స్వామివారి కరుణాకటాక్షాలు కలుగుతాయని జంపన ప్రతాప్ పేర్కొన్నారు.

ప్రముఖుల చేతుల మీదుగా 'జీవన దర్పణం' పుస్తకావిష్కరణ



హైదరాబాద్, నవంబర్ 15 (ప్రజా జ్యోతి) : రచయిత, విశ్లేషకులు, గాయకులు, సామాజిక కార్యకర్త పేరి నాగేశ్వరరావు రచించిన 'జీవన దర్పణం' పుస్తకావిష్కరణ కార్యక్రమం న్యూ మారుతి నగర్‌లోని అన్నపూర్ణ నిలయంలో ఘనంగా జరిగింది. రక్షిత హాస్పిటల్స్ చైర్మన్ రాంప్రసాద్, బ్రిలియంట్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ సీఈఓ పి.ఎస్.ఆర్.మూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పేరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, తులసీరామ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం ధ్యుతి మ్యూజికల్ అకాడమీ అండ్ ఇషాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొమ్మిది గంటల సంగీత విభావరిలో గాయనీమణులు కళ్యాణి దేశ్‌పాండే, ప్రసన్న విజయ్ కుమార్, సవిత, మల్లాది శైలజ, గాయకులు పి.వి.రమణమూర్తి, ఎం.బి.రవికుమార్, జంట గాయకులు లయన్ పేరి నాగేశ్వరరావు, లయన్ విజయలక్ష్మి పాల్గొని ఆలపించారు. 2018లో స్థాపించిన ఈ సంస్థ ఇప్పటివరకు 300కు పైగా కార్యక్రమాలు, 3 వేలకు పైగా పాటల ప్రదర్శనలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పలువురు సాహిత్యాభిమానులు, సంగీత ప్రియులు పాల్గొన్నారు.

హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో రూ.57 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్,నవంబర్16, (ప్రజాజ్యోతి) హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో రూ.57 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి , స్థానిక భరోసా నాయకులు సాయిజెన్ శేఖర్ తో కలిసి శంకుస్థాపన చేయడం జరిగింది.
ఈ సందర్భంగా చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలు రూ.10 లక్షల వ్యయంతో సాయినగర్ నుండి రత్నానిధి అపార్ట్మెంట్‌కు వెళ్లే రహదారి నిర్మాణం.రూ.22 లక్షల వ్యయంతో రాఘవేంద్ర నగర్‌లో ఉస్మాన్ ఇంటి వైపు రహదారి నిర్మాణం. రూ.10 లక్షల వ్యయంతో రాఘవేంద్ర నగర్ నుండి ఇందిరానగర్‌కు వెళ్లే మార్గంలోని గ్యాస్ అంజి రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం. రూ.15 లక్షల వ్యయంతో బుడగ జంగాల స్మశాన వాటికలో మిగిలిన అభివృద్ధి పనులు. ఈ కార్యక్రమంలో డీఈ సాయి పృథ్వి గారు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బుడగ జంగాల కుల పెద్దలు, కాలనీ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల సౌకర్యార్థం, కాలనీల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

శేరిలింగంపల్లి లో అభివృద్ధి పనులు వేగవంతం :

వాల్ టు వాల్ సీసీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పిలుపు



శేరిలింగంపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్... నెహ్రూనగర్, గోపినగర్ లలో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రజల సేవే లక్ష్యంగా భావిస్తూ శేరిలింగంపల్లి ఉమ్మడి డివిజన్ లోని ప్రతి బస్తీలో,కాలనీలో డ్రైనేజీ, పైప్ లైన్,సీసీ రోడ్లు, త్రాగు నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా,పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి వైపు ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.బస్తీ వాసులందరూ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంపూర్ణంగా సహకరించాలని.. రోడ్డుకు అడ్డుగా ఉన్న అరుగులను,ర్యాంపులను స్వచ్ఛందంగా తొలగించి వాల్ టు వాల్ రోడ్డువేయడానికి సహకరిస్తే, బస్తీ వాసులందరికీ ఎంతో సౌకర్యవంతంగా,సురక్షితంగా ఉపయోగపడుతుందని, రాబోయే తరాలకు కూడా మేలు జరుగుతుందని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు.నెట్వర్క్ లేని బస్తీలలో డ్రైనేజీ పైప్ లైన్ వసతి కల్పించి నూతనంగా సీసీ రోడ్లు వేయిస్తున్న కార్పొరేటర్ కి బస్తీ వాసులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్,బీమన్ శ్రీను,వెంకటయ్య,విజయ్, స్థానిక వాసులు తదితరులు పాల్గొన్నారు.

సాంక్షన్ అయిన అభివృద్ధి పనులను మొదలు పెట్టని కాంట్రాక్టర్ లపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర బి ఆర్ ఎస్ నాయకులు బన్నాల



ఉప్పల్,నవంబర్ 16, (ప్రజాజ్యోతి):చిల్కానగర్ డివిజన్లోని బీరప్ప గడ్డ మరియు చిలుక నగర్ ప్రాంతంలో సాంక్షన్ అయినా అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కార్పొరేటర్ ద్వారా శంకుస్థాపన చేసిన పనులను మొదలుపెట్టని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సోమవారం ప్రజావాణిలో జోనల్ కమిషనర్ రాధిక గుప్తా కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్లోని మల్లికార్జున నగర్ లో సిసి రోడ్లు శాంక్షన్ అయ్యి సుమారు తొమ్మిది (9) నెలలు గడుస్తున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టకపోవడంతో మల్లికార్జున్ నగర్ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా కు విన్నవించుకోవడం జరిగింది. అదేవిధంగా చిల్కానగర్ మెయిన్ రోడ్ లో 1000 డయా ట్రంక్ లైన్ పనులు కూడా కాంట్రాక్టర్ మధ్యలోనే ఆపవేసారని దానిని కూడా వెంటనే ప్రారంభించి త్వరగా తిను పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆదర్శనగర్ జనరల్ గ్రేవియార్డులో పనులు మూడు (3) సంవత్సరాల నుంచి నత్త నడకన సాగుతున్నాయని పనులు పూర్తికాక స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు లేక చిల్కానగర్ డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని గ్రేవియార్డ్ కాంట్రాక్టర్ పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కొత్త కాంట్రాక్టర్ తో పనులు పూర్తి చేయించే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను కోరడం జరిగింది. వెంటనే స్పందించిన జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ఎస్సి సురేష్ కుమార్ డి ఈ వెన్నెల గౌడ్ ని వర్క్ ఆర్డర్ తీసుకొని కూడా పనులు మొదలుపెట్టని కాంట్రాక్టర్ల పై సకాలంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది.

ఫిలిబెక్ వీసా, పర్యటన ఉద్దేశంపై సమగ్ర విచారణ జరపాలి

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

భారత్ సమ్మిట్‌లో ఇటలీ నేత వ్యాఖ్యలపై శంషాబాద్ ఎయిర్పోర్ట్ వద్ద ఉన్న ఎఫ్ఆర్ఆర్ఓ కార్యాలయంలో బీజేపీ ఫిర్యాదు





రాజేంద్రనగర్, నవంబర్ 16 (ప్రజా జ్యోతి) ఫిలిబెక్ వీసా, పర్యటన ఉద్దేశంపై సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్ వేదికగా 14 తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన 'భారత్ సమ్మిట్ 2026'లో మన దేశానికి వ్యతిరేకంగా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన విదేశీ రాజకీయ ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శంషాబాద్‌లోని ఎఫ్ఆర్ఆర్ఓ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాంచందర్ రావు. ఈ వ్యవహారంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు నేతృత్వంలో బీజేపీ నాయకులు శంషాబాద్‌లోని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) అధికారులకు ఫిర్యాదు చేశారు. భారత్ సమ్మిట్ సందర్భంగా 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' వంటి నినాదాలతో భారత అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకున్నారంటూ ఫిలిబెక్‌పై బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆయన ఏ కేటగిరీ వీసాపై భారత్‌కు వచ్చారు? పర్యటన వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి? వీసా నిబంధనలు, ఇమ్మిగ్రేషన్ చట్టాలను ఉల్లంఘించారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని ఫిర్యాదులో కోరారు. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025లోని సెక్షన్లు 23, 24 ప్రకారం ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని బీజేపీ నేతలు విజ్ఞప్తి చేశారు. సమ్మిట్ నిర్వాహకుల పాత్రపైనా దర్యాప్తు చేయాలని కోరారు. కేంద్ర హోంశాఖ, విదేశాంగ శాఖ అనుమతులు, రాజకీయ క్లియరెన్స్‌లు పొందారా? ఫిలిబెక్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రాలు, వీసా దరఖాస్తులు, అధికారులకు సమర్పించిన డిక్లరేషన్లను పరిశీలించాలని డిమాండ్ చేశారు. విచారణలో నేరాలకు సంబంధించిన ఆధారాలు లభిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే దేశం నుంచి బహిష్కరించే అంశాన్ని కూడా పరిశీలించాలని కోరారు.విదేశీ పౌరులెవరూ భారత చట్టాలకు అతీతులు కారని, భారత సార్వభౌమత్వాన్ని, ఇమ్మిగ్రేషన్ నిబంధనలను ప్రతి విదేశీ ప్రతినిధి గౌరవించాల్సిందేనని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ తూళ్ళ వీరేందర్ గౌడ్, పార్టీ ముఖ్య అధికార ప్రతినిధిఎన్వీ సుభాష్,లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ జి. రామారావు బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, రాజేంద్రనగర్ బిజెపి కన్వీనర్ మల్లేష్, లీగల్ సెల్ సభ్యులు, వివిధ డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరాంగర్ లోని మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్‌పై ప్రమాదకర స్టంట్లు

నలుగురు యువకులపై కేసు నమోదు

కౌన్సెలింగ్ నిర్వహించిన అత్తాపూర్ పోలీసులు

ప్రజలకు వివాహనదారులకు ఇబ్బంది కలిగించేలా స్టంట్లు వేస్తే కఠిన చర్యలు తప్పవు

అత్తాపూర్ ఇన్స్పెక్టర్ సీతయ్య





రాజేంద్రనగర్, నవంబర్ 16 (ప్రజా జ్యోతి) ప్రజలకు వివాహనదారులకు ఇబ్బంది కలిగించేలా స్టంట్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని అత్తాపూర్ ఇన్స్పెక్టర్ సీతయ్య హెచ్చరించారు. ఆరాంఘర్ చౌరస్తా – బహదూర్‌పురా జూ పార్క్ మధ్య ఉన్న మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్‌పై ప్రమాదకర రీతిలో వాహనాలతో స్టంట్లు చేస్తున్న నలుగురు యువకులపై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.ఎసోమవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో నలుగురు యువకులు రెండు యాక్టివా స్కూటర్లపై ఫ్లైఓవర్‌పై ఇతరుల ప్రాణాలకు, ప్రజా భద్రతకు ముప్పు కలిగించే విధంగా స్టంట్లు చేస్తూ ఫోటోలు దిగుతూ కాలాపత్తర్ కు చెందిన పింజరి అలీమ్,షేక్ హుజైఫ్, మహారాష్ట్ర లాతూర్ జిల్లాకు చెందిన షేక్ యమాన్,మరోక ఒక మైనర్ బాలుడు పట్టుబడ్డారు. ఈ ఘటనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 1217/2026 గా దీచీూ సెక్షన్లు 125, 289, 292 తీ/ఽ 3(5) మరియు వీఎ ూాష్ సెక్షన్లు 181, 183, 190(అఅ) కింద కేసు నమోదు చేశారు. అనంతరం నిందితులను, వారి కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదకర, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడవద్దని అత్తాపూర్ సీఐ సీతయ్య హెచ్చరించారు. ప్రజా భద్రతకు ముప్పు కలిగించే స్టంట్లు, ర్యాష్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

తలకొండపల్లిలో ఘనంగా పత్రికా దినోత్సవ వేడుకలు



జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపిన మండల సర్పంచులు,నాయకులు

తలకొండపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి) రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో పత్రికా దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా మండలంలోని పాత్రికేయులందరినీ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచులు,నాయకులు మాట్లాడుతూ....పత్రికా స్వేచ్ఛ,విలేకరుల బాధ్యత,సమాజంలో జర్నలిజం ప్రాధాన్యత గొప్పదని కొనియాడారు.ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభంగా పత్రికలు వ్యవహరిస్తున్నాయని, నిజాయితీగా,నిర్భయంగా వార్తలను ప్రజలకు అందించడంలో పాత్రికేయులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు.భారతదేశంలో ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటైన నవంబర్ 16వ తేదీని ప్రతి ఏటా జాతీయ పత్రికా దినోత్సవంగా జరుపుకుంటున్నామని గుర్తుచేశారు.పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవడంతో పాటు,బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ,ప్రజల గొంతుకగా నిలవడంలో మండల విలేకరులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.మండల అభివృద్ధిలో,ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రికల పాత్ర ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు.రోడ్లు,తాగునీరు,విద్య,వైద్యం వంటి ఎన్నో సమస్యలు పత్రికల ద్వారానే అధికారుల దృష్టికి వెళ్తున్నాయని కొనియాడారు.అనంతరం పాత్రికేయులు తమ అనుభవాలను పంచుకున్నారు.ప్రజలకు సత్యాన్ని చేరవేయడమే తమ ప్రధాన లక్ష్యమని,భవిష్యత్తులో కూడా అదే స్ఫూర్తితో పనిచేస్తామని తెలిపారు.తమను గౌరవించి సన్మానించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయులు దరువుల శంకర్,సిహెచ్ విష్ణువర్ధన్,ఎన్.వెంకట్ రెడ్డి,మీసాల మహేష్, రాచాలపల్లి రాజు,విజయ్ కుమార్,మీసాల ఆంజనేయులను నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్,వెల్జాల్ గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ తనయుడు వానరాశి వెంకటేష్,హర్య నాయక్ తండ సర్పంచ్ కొర్ర శిరీష కృష్ణ నాయక్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిన్నాల దేవిడ్,హర్య నాయక్ తండా ఉపసర్పంచ్ రమేష్,రాంపూర్ మత్స్యశాఖ సొసైటీ జనరల్ సెక్రెటరీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో 24 గంటల్లోనే మిస్సింగ్ సూట్‌కేస్ గుర్తింపు

బంగారు ఆభరణాలతో సహా బాధితుడికి అప్పగింత

ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీసులకు బాధితుడు అభినయ్ వత్సల్



రాజేంద్రనగర్, నవంబర్ 16 (ప్రజా జ్యోతి) ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ అవుట్ పోస్ట్ పోలీసులు 24 గంటల్లోనే మిస్సింగ్ అయిన క్యాబిన్ సూట్‌కేస్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించారు. 14-11-2026 న హాంకాంగ్ నుండి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు జఽ601 ఫ్లైట్‌లో వచ్చిన బి. అభినయ్ వత్సల్ అనే ప్రయాణికుడు తన క్యాబిన్ సూట్‌కేస్ మిస్ అయిందని ఫిర్యాదు చేశారు.

మిస్ అయిన బ్యాగులో ఉన్న వస్తువులు

5 తులాల బంగారం,2 బంగారు గొలుసులు,2 బంగారు ఉంగరాలు,2 జతల బంగారు చెవి రింగులు,1 మొబైల్ ఫోన్,1 హార్డ్ డిస్క్ ఉన్నాయని ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన పోలీసులు 15-11-2026 న ఫ్లైట్ ల్యాండింగ్ ఏరియా నుండి పార్కింగ్ ఏరియా వరకు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. పరిశీలనలో మరో ప్రయాణికుడు పొరపాటున ఆ సూట్‌కేస్‌ను తీసుకుని కారులో వెళ్లినట్లు గుర్తించారు.వాహన రిజిస్ట్రేషన్ వివరాలను ట్రేస్ చేయగా, ఆ వాహనం ముగ్గురు వ్యక్తుల పేర్లపై రిజిస్టర్ అయి ఉన్నట్లు తేలింది. వారిని సంప్రదించగా, తాము ఇటీవలే వాహనాన్ని మరొకరికి విక్రయించినట్లు తెలిపారు. రిజిస్టర్డ్ ఓనర్ల ద్వారా ప్రస్తుత ఓనర్ వివరాలను సేకరించి, అతడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు.చివరకు మిస్ అయిన సూట్‌కేస్‌ను విజయవంతంగా రికవరీ చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారుకు అప్పగించారు. త్వరితగతిన స్పందించిన ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్ నినో ప్రభావంతో ఎండిన పంటలు..రైతులకు తీవ్ర నష్టం

చంద్రధనలో ఎండిన వరి పంటను పరిశీలించిన వ్యవసాయాధికారి



తలకొండపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి) రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో ఎల్ నినో ప్రభావం వల్ల వాసకాలం వర్షాలు సరిగా కురవకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.రైతులు అప్పులు చేసి వేసిన పత్తి,మొక్కజొన్న పంటలు నీటి కొరతతో బాగా దెబ్బతిన్నాయి.అలాగే భూగర్భ జలాలు కూడా అడుగంటిపోవడంతో బోర్లు,బావులు ఎండిపోయి వరి సాగు చేసిన రైతుల పంటలు పూర్తిగా ఎండిపోయాయి.దీంతో పెట్టుబడి కూడా రాక రైతులు ఆందోళన చెందుతున్నారు.ఈ నేపథ్యంలో గ్రామ వ్యవసాయాధికారి లలిత సోమవారం గ్రామంలో పర్యటించి రైతు ఆవుల బాలకిష్టయ్య ఎండిన వరి పంటను పరిశీలించారు.పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకుని నివేదిక తయారు చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందించాలని,రుణమాఫీ,పంట బీమా అమలు చేయాలని కోరారు.పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వ్యవసాయాధికారి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ,ఉప సర్పంచ్ ఎన్నెడ్ల రవీందర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ సొల్లు సుధాకర్,రైతు ఆవుల బాలకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో ఓ ఫామ్‌హౌస్‌పై పోలీసుల దాడి

5 మంది అరెస్ట్, మరో 4 పరార్

పేకాట ఆడుతున్న 9 మందిపై కేసు నమోదు

రూ.9,30,620 నగదు, 6 మొబైల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం



రాజేంద్రనగర్, నవంబర్ 16 (ప్రజా జ్యోతి) మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టేపల్లిలో ఉన్న కేకేకే మాఘర్ ఫామ్‌హౌస్‌లో అక్రమ పేకాట ఆడుతున్నారన్న పక్క సమాచారంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దాడి నిర్వహించారు. సోమవారం పెట్రోల్ సిబ్బంది, పంచ సాక్షులతో కలిసి దాడి చేయగా 5 గురిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నిందితులు అక్కడి నుండి పరారయ్యారు. విచారణలో పట్టుబడిన వ్యక్తులు తాము గత కొన్ని నెలలుగా ఫామ్‌హౌస్‌లో డబ్బు కోసం కార్డ్స్ ఆడుతూ జూదంలో పాల్గొంటున్నామని, ఫామ్‌హౌస్ యజమాని ఖదీర్‌కు అతని సహచరుడు శిల ఏ సామ్ ద్వారా 10% కమీషన్ చెల్లిస్తున్నామని వెల్లడించారు. ఫామ్ హౌస్ లో పేకాట ఆడుతున్న ఫామ్ హౌస్ యజమాని ఖదీర్,శిలా, మోత్కూరి నరసింహ, మహ్మద్ అస్లాం, మహ్మద్ జమీల్,ఇన్నా రెడ్డి, శేఖర్ బాబు, మీర్జా,యూసుఫ్.వారి వద్ద నుండి రూ.9,30,620 నగదు, 6 స్మార్ట్‌ఫోన్‌లు, 6 సెట్ల ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు తొమ్మిది మందిపై సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

సేవారంగంలో వనం లక్ష్మీకాంత్ రెడ్డికి అరుదైన గౌరవం

ఢిల్లీలో అంతర్జాతీయ 'సేవారత్న' పురస్కారం ప్రదానం

బహుజన సాహిత్య అకాడమీ 20వ జాతీయ సదస్సులో అవార్డు అందజేత



చేవెళ్ల నవంబర్ 16(ప్రజా జ్యోతి): సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న చేవెళ్ల మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన వనం లక్ష్మీకాంత్ రెడ్డిని అంతర్జాతీయ స్థాయి పురస్కారం వరించింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 20వ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ఆయనకు ప్రతిష్టాత్మక 'అంతర్జాతీయ సేవారత్న' పురస్కారాన్ని అందజేశారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన ఈ వేదుకలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా వనం లక్ష్మీకాంత్ రెడ్డి 'సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్' అవార్డును స్వీకరించారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది ప్రముఖ ప్రతినిధులు హాజరయ్యారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషికి గుర్తింపు

సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక చైతన్యం, సమాజోద్ధరణ లక్ష్యంగా వనం లక్ష్మీకాంత్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన అకాడమీ నిర్వాహకులు ఆయనను ఈ అంతర్జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. ఒక గ్రామస్థాయి నుంచి జాతీయ వేదిక వరకు ఆయన సేవలకు గుర్తింపు లభించడం ఈర్లపల్లి గ్రామంతో పాటు చేవెళ్ల ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి అంతర్జాతీయ స్థాయి పురస్కారాన్ని అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ గౌరవాన్ని అందించిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నల్ల రాధాకృష్ణ, నిర్వాహక బృందం, కేంద్ర ప్రభుత్వ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజాసేవే లక్ష్యంగా మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు.

పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ వై. నాగిరెడి




ి గారిని మరియు శాఖ డైరెక్టర్ శ్రీ శ్యామ్ ప్రసాద్ లాల్, ఐఏఎస్ గారిని నేడు టీఎన్‌జీఓస్ (ఛీ+ూం) మరియు టీజీఓస్ (ం+ూం) సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ గారికి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.?ఈ సమావేశంలో టీఎన్‌జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీ ఎస్. విక్రమ్ కుమార్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ం+ూూ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీ ఎం.బి. కృష్ణ యాదవ్, టీజీఓఏ హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీ గండూరి వెంకట్, టీజీఓఏ హైదరాబాద్ జిల్లా ఈసీ సభ్యులు శ్రీమతి బి. జ్యోతి, శ్రీమతి లక్ష్మీ భవాని మరియు టీఎన్‌జీఓస్ యూనియన్ సీఆర్వో (జ=ూ) యూనిట్ అధ్యక్షులు శ్రీ ఎస్.డబ్ల్యూ.ఐ. రజ్వీ తదితరులు పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, క్లిష్ట పరిస్థితులలో మరియు ప్రభుత్వం అప్పగించిన ప్రతి బాధ్యతను నిర్వర్తించడంలో పౌర సరఫరాల శాఖ ఉద్యోగులు నిరంతరం ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగులు అందిస్తున్న విశిష్ట సేవలను, వారి అంకితభావాన్ని కమిషనర్ మరియు డైరెక్టర్ గార్లకు వివరించారు. శాఖాపరమైన అభివృద్ధికి, ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఉద్యోగ సంఘాల తరఫున ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

కొత్తూరు సీఐ నాగార్జున రెడ్డి

ఈగల్ టీమ్,డాగ్ స్క్వాడ్ బృందాలతో కమల ఫుడ్ కంపెనీ, కరాచీ,సుప్రీం పైప్ కంపెనీలో పోలీసులు తనిఖీలు





కొత్తూరు నవంబర్ 16 (ప్రజా జ్యోతి) గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కొత్తూరు సీఐ నాగార్జున రెడ్డి అన్నారు.కొత్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న కమల ఫుడ్ కంపెనీ,సుప్రీమ్ పైప్,కరాచీ కంపెనీలలో కొత్తూరు సీఐ బి.నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఈగల్ టీమ్ డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సదరు కంపెనీలలో పనిచేస్తున్న వలస కార్మికులు నివసించే బ్యారక్‌లతో పాటు కంపెనీ ప్రాంగణంలోని వివిధ ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర నిషేధిత మాదకద్రవ్యాలను అక్రమంగా నిల్వ ఉంచారా అనే విషయాన్ని గుర్తించేందుకు డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు.అనంతరం, సదరు కంపెనీలలో పనిచేస్తున్న సుమారు 500 మంది వలస కార్మికులు మరియు ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు,సైబర్ నేరాలు,పోక్సో (ూజూూ) చట్టానికి సంబంధించిన నేరాలు,ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు మరియు వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.అదే విధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన సీఐ నాగార్జున రెడ్డి కల్పించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని,కార్లలో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సీఐ నాగార్జున రెడ్డి సూచించారు.అదేవిధంగా, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలు మరియు ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చిన్నారుల రక్షణ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ నాగార్జున రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సత్యశిలారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే భావి సమాజానికి పునాది

వెయ్యి మంది విద్యార్థులకు వైద్య నిపుణుడు విక్రాంత్ సింగ్ అవగాహన

అబ్దుల్లాపూర్ మెట్టు/ నవంబర్ 16 (ప్రజాజ్యోతి) విద్యార్థి దశ నుంచే ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ విక్రాంత్ సింగ్ ఠాకూర్ సూచించారు.మోత్కూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ రక్తదాన సేవా మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది విద్యార్థినీ విద్యార్థులకు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ విక్రాంత్ సింగ్ ఠాకూర్ విద్యార్థులకు షుగర్, బీపీ సమస్యలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచే మంచి ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై సరైన అవగాహన ఉంటే భవిష్యత్తులో అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లు నవీన్ మాట్లాడుతూ.. వృత్తిపరమైన విధుల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ విద్యార్థులు, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం విలువైన సమయాన్ని కేటాయిస్తూ తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాల ద్వారా మార్పునకు కృషి చేస్తున్న డాక్టర్ విక్రాంత్ సింగ్ ఠాకూర్‌కు భారత్ రక్తదాన సేవా మిషన్ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భారత్ రక్తదాన సేవా మిషన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కురుమేటి నవీన్, గౌరవ అధ్యక్షురాలు తోట రేణుక, ప్రధాన కార్యదర్శి వేగూరు హేమంత్, మోత్కూరు మండల వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కోశాధికారి నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. అరవింద్, ధర్మారపు వెంకటయ్య, ఉప్పలయ్య, ముక్కముల లింగమల్లు, సంస్థ సభ్యులు గుర్రం సురేష్, నరసింహతో పాటు గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోపీచంద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన లక్ష్మీనివాస్



తలకొండపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి) భారత బ్యాడ్మింటన్ క్రీడకు ప్రపంచస్థాయిలో విశేష గుర్తింపు తీసుకొచ్చిన ప్రముఖ క్రీడాకారుడు,అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కోచ్,పద్మభూషణ్ అవార్డు గ్రహీత పుల్లెల గోపీచంద్ కి తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టిఎస్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షులు ఎం.లక్ష్మీనివాస్ సోమవారం హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.గోపీచంద్ 2001లో ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్ షిప్ గెలిచి భారతదేశానికి అరుదైన గౌరవం తీసుకొచ్చారని,అనంతరం గోపీచంద్ అకాడమీ స్థాపించి సైనా నెహ్వాల్,పీవీ సింధు,కిదాంబి శ్రీకాంత్ వంటి ఎంతోమంది అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేశారని ఈ సందర్భంగా లక్ష్మీనివాస్ గుర్తు చేశారు.ఈ సందర్భంగా లక్ష్మీనివాస్ మాట్లాడుతూ...గోపీచంద్ క్రమశిక్షణ, కృషి,పట్టుదల,అంకితభావం దేశంలోని యువతకు ఆదర్శమని,ఆయన మరెన్నో సంవత్సరాలు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవిస్తూ భారత బ్యాడ్మింటన్ క్రీడకు,యువ క్రీడాకారుల అభివృద్ధికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.గ్రామీణ ప్రాంతాల్లోని యువత కూడా గోపీచంద్ ని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని,ప్రభుత్వం క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించాలని ఆయన కోరారు.

తలకొండపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద కార్మికులు నిరసన



తలకొండపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి) దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా తలకొండపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద భవన నిర్మాణ కార్మికులు సోమవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఉదయం నుంచే మండలంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివచ్చారు.చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని,నినాదాలు చేస్తూ బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు.తమ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు.కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.కార్మికుల ఐక్యతే వారి బలమని,అందరూ కలిసికట్టుగా ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.కార్మికుల సంక్షేమం,లేబర్ కార్డులు,పెండింగ్ బకాయిలు తదితర అంశాలపై నిరసనలో ప్రధానంగా ప్రస్తావించారు.భవన నిర్మాణ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని,సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందజేయాలని,పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు చేపట్టాలని,వృద్ధాప్యంలో ఆదుకునేలా పెన్షన్ సౌకర్యం కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు.ప్రభుత్వం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.అనంతరం మండల మహాసభ కూడా నిర్వహించారు.మహాసభలో మండలంలోని కార్మికుల సమస్యలు,సంఘ బలోపేతంపై చర్చించారు.కార్మికులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని తీర్మానించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటయ్య,రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాజమోని లక్ష్మయ్య వివిధ గ్రామాల కార్మిక సంఘం నాయకులు తదితరులున్నారు.

మైనార్టీ సెల్ అధ్యక్షునిగా అజీమ్!

ఎమ్మెల్యే కాలే యాదయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందజేత

కాంగ్రెస్ మైనార్టీ విభాగం బలోపేతానికి కృషి చేస్తా

మైనార్టీ సెల్ అధ్యక్షుడు అజీమ్







చేవెళ్ల నవంబర్ 16(ప్రజా జ్యోతి): కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నూతన కమిటీని ప్రకటించారు. చేవెళ్ల మున్సిపల్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహమ్మద్ అజీమ్ నియమితులయ్యారు. రంగారెడ్డి జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ మహమ్మద్ లయక్ ఈ నియామకాన్ని ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమత వెంకట్‌రెడ్డి,వైస్ చైర్మన్ రాము గౌడ్, చేవెళ్ల నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ మహమ్మద్ చాన్ పాషా,11వ వార్డు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా మహమ్మద్ అజీమ్ నియామక పత్రాన్ని అందుకున్నారు.

మైనార్టీలకు అండగా.. పార్టీ బలోపేతమే లక్ష్యంగా!

నూతన అధ్యక్షుడు మహమ్మద్ అజీమ్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ మైనార్టీ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తానని ధీమా వ్యక్తం చేశారు.

నూతన కమిటీ

మైనార్టీ సెల్ మున్సిపల్ ఉపాధ్యక్షులుగా మహమ్మద్ షరీఫ్ ఖాన్, సజీముద్దీన్, రఫీక్ షా; ప్రధాన కార్యదర్శులుగా తాజుద్దీన్, హఫీజ్; సంయుక్త కార్యదర్శులుగా అమ్మద్ జానీ, షాబుద్దీన్; కార్యదర్శులుగా ఖదీర్, సలీం; కోశాధికారిగా ఉమర్; సభ్యులుగా నయీమ్, వజిత్, షబ్బీర్, ఫయాజ్, రఫీక్, రహీం, రషీద్‌లను నియమించారు.ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు జనార్దన్ రెడ్డి, కౌన్సిలర్లు శైలజ ఆగిరెడ్డి,కృష్ణ నాయక్, కళ్యాణి యాదగిరి, మాధవి యాదిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు, ఫరిన్ ఖదీర్ పాషా, చాన్ పాషా, చేవెళ్ళ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, ఊరేళ్ళ మాజి సర్పంచ్, జంగీర్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గని, మైనారిటీ మండల అధ్యక్షులు సల్మాన్, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్ మసీయుద్దిన్, బషీర్, కైసర్, షేక్ అహ్మద్, కలీం తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్ జోన్‌లో యూసీడీ కార్యకలాపాలపై జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జోనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం

పాల్గొన్న యూసీడీ అడిషనల్ కమిషనర్ అనితా గ్రేస్, జాయింట్ కమిషనర్ రాధా, ప్రాజెక్ట్ ఆఫీసర్ మమతాబాయి





రాజేంద్రనగర్, నవంబర్ 16 (ప్రజా జ్యోతి) మహిళా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.

సోమవారం రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన యూసీడీ కార్యకలాపాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యూసీడీ అడిషనల్ కమిషనర్ అనితా గ్రేస్, జాయింట్ కమిషనర్ రాధా, ప్రాజెక్ట్ ఆఫీసర్ మమతాబాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలో అమలవుతున్న వివిధ యూసీడీ కార్యక్రమాలపై సీఓలు, పీఓలు మరియు ఆర్పీలతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలోస్వయం సహాయక సంఘాల ఏర్పాటు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని, ప్రతి ఆర్పీ నెలాఖరులోగా కనీసం 10 కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.బ్యాంక్ లింకేజ్ లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఒక్కరూ నెలాఖరులోగా కనీసం రూ.50 లక్షల చొప్పున బ్యాంక్ లింకేజ్ రుణాలు మంజూరయ్యేలా కృషి చేయాలని సూచించారు. యూసీడీ కార్యక్రమాలన్నింటినీ నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం సమయానికి పూర్తి చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన మహిళలకు చేరేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు స్వేచ్ఛాయుత పత్రికా రంగం!

నిజాయితీ, నిష్పక్షపాత ధోరణి, సామాజిక బాధ్యతలతోనే పత్రికలకు ప్రజల విశ్వాసం

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ గంప విజయకుమార్ ప్రత్యేక సందేశం

నాగారం, నవంబర్ 16 (ప్రజాజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా సమాజానికి దిశానిర్దేశం చేస్తుందని, ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని అసోసియేషన్ ఆఫ్ కమ్యూనిటీ ఫార్మసిస్ట్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఇండియన్ ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి, డాక్టర్ గంప విజయకుమార్ పేర్కొన్నారు. సోమవారం జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పత్రికా స్వేచ్ఛ, వృత్తి నైతికత, సామాజిక బాధ్యతల ప్రాధాన్యాన్ని వివరించారు.

పత్రికా దినోత్సవం ప్రాముఖ్యత

భారతదేశంలో 1966 నవంబర్ 16న భారత పత్రికా మండలి కార్యకలాపాలు ప్రారంభమైన సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ రోజును జాతీయ పత్రికా దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడంతోపాటు పాత్రికేయ ప్రమాణాలను మెరుగుపరచడం పత్రికా మండలి ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, సామాజిక అన్యాయాలను బయటపెట్టడం పత్రికల ప్రధాన బాధ్యతలని పేర్కొన్నారు.

మారుతున్న పత్రికా రంగం

ఒకప్పుడు వార్తాపత్రికల ద్వారా ప్రజలకు సమాచారం చేరడానికి సమయం పట్టేదని, ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో క్షణాల్లో సమాచారం ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తోందని తెలిపారు. సామాజిక మాధ్యమాలు, అంతర్జాల వార్తా వేదికలు, కృత్రిమ మేధస్సు వినియోగంతో సమాచార వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. అయితే వేగం కంటే వాస్తవాలకు, ప్రచారం కంటే ప్రజాప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

భారతదేశంలో ప్రస్తుత పరిస్థితులు

భారతదేశంలో పత్రికా రంగం విస్తరిస్తున్నప్పటికీ తప్పుడు సమాచారం, నిర్ధారణలేని వార్తలు, సంచలనాత్మక కథనాలు, వాణిజ్య ప్రయోజనాల ప్రభావం వంటి సవాళ్లు ఎదురవుతున్నాయని అభిప్రాయపడ్డారు. కొన్ని సందర్భాల్లో వార్తల మధ్య పోటీ కారణంగా వాస్తవాల నిర్ధారణకు తగిన ప్రాధాన్యం తగ్గే ప్రమాదం ఉందన్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న స్థానిక పాత్రికేయుల సేవలు అభినందనీయమని తెలిపారు.

పత్రికా మండలి మార్గదర్శకాల ఆవశ్యకత

భారత పత్రికా మండలి రూపొందించిన పాత్రికేయ నైతిక నియమావళి ప్రకారం వార్తలు ఖచ్చితత్వం, నిష్పక్షపాత ధోరణి, వాస్తవ నిర్ధారణ, వ్యక్తిగత గోప్యతకు గౌరవం వంటి ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. ఆరోపణలపై వార్తలు ప్రచురించే ముందు సంబంధిత వ్యక్తుల వివరణ తీసుకోవడం, తప్పులు జరిగినప్పుడు సవరణలు ప్రచురించడం, వార్తల పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టకుండా వ్యవహరించడం అవసరమన్నారు. పత్రికా స్వేచ్ఛతోపాటు బాధ్యత కూడా సమానంగా ఉండాలని సూచించారు.

జరగాల్సిన మార్పులు తీసుకోవాల్సిన చర్యలు

పాత్రికేయులకు వృత్తిపరమైన శిక్షణ, సమాచార నిర్ధారణ పద్ధతులపై అవగాహన, కృత్రిమ మేధస్సు ద్వారా సృష్టించిన తప్పుడు సమాచారాన్ని గుర్తించే నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. గ్రామీణ పాత్రికేయులకు అవసరమైన వృత్తిపరమైన రక్షణ, సంక్షేమ చర్యలు కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్యం, విద్య, ఔషధ భద్రత, పర్యావరణ పరిరక్షణ, అవినీతి నిరోధం, వినియోగదారుల హక్కులు వంటి ప్రజాప్రయోజన అంశాలకు పత్రికల్లో మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

బాధ్యతారాహిత్యం వల్ల పరిణామాలు

నిర్ధారణలేని వార్తల ప్రచారం వల్ల వ్యక్తుల ప్రతిష్ఠ దెబ్బతినడంతోపాటు సమాజంలో అపోహలు, భయాందోళనలు, అనవసర వివాదాలు తలెత్తే అవకాశముందని హెచ్చరించారు. ముఖ్యంగా ఆరోగ్యం, ఔషధాలు, వైద్య చికిత్సలకు సంబంధించిన తప్పుడు సమాచారం ప్రజల ప్రాణాలకు కూడా ప్రమాదకరంగా మారవచ్చన్నారు. అందువల్ల శాస్త్రీయ ఆధారాలు, నిపుణుల అభిప్రాయాలను పరిశీలించిన తరువాతే ప్రజారోగ్య వార్తలను ప్రచురించడం అవసరమని స్పష్టం చేశారు.



నిష్పక్షపాత పాత్రికేయంతోనే సమాజాభివృద్ధి

పత్రికలు ప్రజల సమస్యలను నిర్మాణాత్మకంగా వెలుగులోకి తీసుకువస్తే ప్రభుత్వ వ్యవస్థల్లో జవాబుదారీతనం పెరుగుతుందని, ప్రజల్లో చైతన్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నిజాయితీగా పనిచేసే పాత్రికేయులను సమాజం గౌరవిస్తుందని, వారి స్వేచ్ఛను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, సంస్థలు, ప్రజలందరిపైనా ఉందన్నారు.

"పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి బలం. పాత్రికేయ నైతికత ఆ స్వేచ్ఛకు రక్షణ. నిజాన్ని నిర్భయంగా చెప్పే కలం సమాజాన్ని మార్చగల శక్తివంతమైన ఆయుధం. వార్త వేగంగా చేరడం గొప్ప కాదు, నిజాయితీగా చేరడమే గొప్ప"లి అని డాక్టర్ గంప విజయకుమార్ పేర్కొన్నారు.జాతీయ పత్రికా దినోత్సవాన్ని కేవలం వేడుకగా కాకుండా ప్రజాస్వామ్య విలువలు, పత్రికా స్వేచ్ఛ, వృత్తి నైతికతలను పరిరక్షించుకునే సంకల్ప దినంగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాత్రికేయులు, సంపాదకులు, పత్రికా యాజమాన్యాలు, వార్తా సంస్థల సిబ్బందికి జాతీయ పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రొఫెసర్ డాక్టర్ గంప విజయకుమార్

అధ్యక్షులు, అసోసియేషన్ ఆఫ్ కమ్యూనిటీ ఫార్మసిస్ట్స్ ఆఫ్ ఇండియా, తెలంగాణ రాష్ట్ర శాఖ. కోశాధికారి, ఇండియన్ ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర శాఖ. హైదరాబాద్.

నిరుపేద కుటుంబానికి ఉప్పల ట్రస్ట్ ద్వారా స్లాబ్ కోసం సిమెంట్ అందజేత



తలకొండపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి) రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని కాశమని నరేష్ కి ఇంటి నిర్మాణంలో స్లాబ్ కొరకు సోమవారం సిమెంట్ ఇవ్వడం జరిగింది.రాష్ట్ర నాయకులు,మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్,ఉప్పల వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ సహాయం అందించారు.నిరుపేద కుటుంబాలకు ఇంటి నిర్మాణం కోసం మాజీ జడ్పిటిసి,ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తమ ట్రస్ట్ ద్వారా స్లాబ్ కొరకు సిమెంట్ ఇప్పించారు.నరేష్ కుటుంబం ఎంతో కాలంగా సొంత ఇంటి కలను సాకారం చేసుకునేందుకు కష్టపడుతోంది.ఆర్థిక ఇబ్బందుల కారణంగా స్లాబ్ వేసే దశలో నిర్మాణం ఆగిపోయింది.ఈ విషయం తెలుసుకున్న ఉప్పల వెంకటేష్ వెంటనే స్పందించి,తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్లాబ్ కొరకు అవసరమైన సిమెంట్ అందజేశారు.దీంతో ఆ కుటుంబానికి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునే అవకాశం లభించింది.ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ...నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే తమ ట్రస్ట్ లక్ష్యమని,భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.పేద కుటుంబాలకు సొంత ఇల్లు అనేది ఎంతో పెద్ద కల అని,ఆ కలను నిజం చేయడంలో తమ వంతు సహాయం అందిస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు.సరైన సమయంలో ఆదుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు,తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్,మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ ముదిరాజ్,మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య,ఉప సర్పంచ్ నూకం కోటేశ్వర్ ముదిరాజ్,మాజీ వార్డు సభ్యులు విఠల్ ముదిరాజ్,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కొనగట్టు శివాలయానికి పోటెత్తిన భక్తులు!

కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు



చేవెళ్ల నవంబర్ 16(ప్రజా జ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా చేవెళ్లలోని కొనగట్టు శివాలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పరమశివుడిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా చేవెళ్ల ఎస్ఐ కోటేశ్వరరావు, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వెంకటాపురం కల్వర్టు వద్ద అపరిశుభ్రతపై తోట లక్ష్మీకాంత్ రెడ్డి ఆగ్రహం.. చెత్త తొలగింపునకు తక్షణ ఆదేశాలు!





అల్వాల్ నవంబర్ 16(ప్రజా జ్యోతి) వెంకటాపురంలోని కల్వర్టు ప్రాంతం చెత్తాచెదారంతో డంపింగ్ యార్డును తలపిస్తుండటంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేరుకుపోయిన చెత్త నుంచి వెలువడుతున్న దుర్గంధంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై స్పందించిన మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట లక్ష్మీకాంత్ రెడ్డి పరిసర ప్రాంతాల కాలనీవాసులు, స్థానిక నాయకులతో కలిసి కల్వర్టు ప్రాంతాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కల్వర్టు వద్ద పెద్దఎత్తున పేరుకుపోయిన చెత్తాచెదారం కారణంగా ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.ప్రజారోగ్యానికి, పరిసరాల పరిశుభ్రతకు ముప్పుగా మారిన చెత్తాచెదారాన్ని తక్షణమే తొలగించాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం మళ్లీ డంపింగ్ యార్డుగా మారకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దేవేందర్, గణేష్ గౌడ్, స్థానిక నాయకులు, పరిసర కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి

తహసిల్దార్ ఎంపీడీవోకు పాలకవర్గం వినతి

సర్పంచ్ మస్కు అనిత శరణం ఆధ్వర్యంలో వినతి

కాలుష్య కారకాలతో ప్రజా ఆరోగ్యానికి విఘాతం

డంపింగ్ యార్డ్ స్థలాన్ని రద్దు చేయాలని తీర్మాణం



యాచారం, నవంబర్ 16 (ప్రజాజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మండల కేంద్రంలో ప్రతిపాదించి ఏర్పాటు చేయ తల పెట్టిన డంపింగ్ యార్డ్ పై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ.. యాచారం గ్రామపంచాయతీ పాలకవర్గం కోరారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ రద్దు కోరుతూ సోమవారం సర్పంచ్ మస్కు అనిత శరణం ఆధ్వర్యంలో పాలకవర్గం.. తహసిల్దారు అయ్యప్ప, ఎంపీడీవో రాధారాణికి వినతి పత్రం అందజేశారు. సర్వేనెంబర్ 121లో భారీ డంపింగ్ యార్డ్ వ్యర్థ పదార్థాలతో విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని వినతిలో కోరారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో ఉత్పన్నమయ్యే కాలుష్య కారకాలతో ప్రజా ఆరోగ్యానికి విఘాతం కలిగే ప్రమాదం ఉందన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిమిత్తం గతంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ స్థలాన్ని పలు కారణాలచే రద్దు చేయాలన్నారు. ప్రజల అభిప్రాయాలు, స్థల అనుకూలత, భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులు ఇతర కారణాల రీత్యా డంపింగ్ యార్డ్ స్థలాన్ని రద్దు చేయాలని గ్రామపంచాయితీ తీర్మానించినట్లు చెప్పారు. ఉప సర్పంచ్ మంగ కృష్ణ, వార్డు సభ్యులు మారోజు ప్రదీప్ రెడ్డి లక్ష్మి జిల్లా శ్రీనాథ్ మహమ్మద్ పాతివేగం మస్కు యాదగిరి మహమ్మద్ సాజిద్ బెల్లి వైష్ణవి రమేష్ ఎండి పాషా,నారీమల్ల లావణ్య వెంకటేష్ నారిమల్ల శ్రీకాంత్ అందజేసిన వారిలో ఉన్నారు వినతి అందజేసిన వారిలో ఉన్నారు.

ఓల్డ్ అల్వాల్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్.. ఇందిరాగాంధీ చౌరస్తా విస్తరణకు అధికారుల కసరత్తు!



అల్వాల్ నవంబర్ 16 (ప్రజా జ్యోతి) ఓల్డ్ అల్వాల్‌లోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, రహదారి విస్తరణతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణకు ఆటంకం లేకుండా చౌరస్తాలో ప్రస్తుతం ఉన్న సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని తొలగించి, సమీపంలోని మరో అనువైన స్థలంలోకి మార్చాలని అభిప్రాయపడ్డారు.ఈ మేరకు ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, ఎంఎంసీ డిప్యూటీ ఇంజనీర్ మహేష్ సంబంధిత అధికారులతో కలిసి పరిస్థితిని పరిశీలించి, రోడ్డు వెడల్పు వంటి అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా రహదారి విస్తరణ పనులను సమన్వయంతో చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కిషోర్, ఏఎంసీ ఏఈ రవళి, స్థానికులు వేణు, శరత్, ఆంజనేయులు, బాబు, నాయకులు లడ్డు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస తొలి సోమవారం.. శివాలయాల్లో భక్తుల ఆధ్యాత్మిక సందడి!

మరకత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో మహా స్ఫటిక లింగానికి ఏకాదశ రుద్రాభిషేకం.. వైభవంగా రుద్ర హోమం!



అల్వాల్ నవంబర్ 16 (ప్రజా జ్యోతి) కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పరమశివుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలు హరహర మహాదేవ, ఓం నమఃశివాయ నామస్మరణలతో మార్మోగాయి. భక్తులు దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో శివునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాసంలో తొలి సోమవారం కావడంతో ఆలయాల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఇందులో భాగంగా మరకత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో కొలువుదీరిన మహా స్ఫటిక లింగానికి అత్యంత భక్తిశ్రద్ధలతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం లోకకల్యాణం, సకల జనుల శ్రేయస్సు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ రుద్ర హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, కార్యనిర్వహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా ఆలయాల్లో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది.

అర్హుల ఇంటికే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు..

మోమిన్‌పేట్‌లో 622 మందికి చేయూత! స్వయంగా పెన్షన్ ప్రొసీడింగ్స్ అందజేసిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్





మోమిన్‌పేట్ నవంబర్ 16 ప్రజా జ్యోతి) వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యతనిస్తూ అర్హులైన పేదలకు చేయూతనందిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు చెందిన 622 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్వయంగా లబ్ధిదారులకు పెన్షన్ ప్రొసీడింగ్స్ అందజేశారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్, డీఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సదానందం, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు నరోత్తం రెడ్డి, శంకర్ యాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సురేందర్, ఎంపీఓ సృజన్ కుమార్, ఏపీఎం మధుకర్, వివిధ శాఖల అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిగా ఎన్‌రోల్ అయిన బషీరాబాద్ యువకుడు ఔషేటి సాయి కుమార్



బషీరాబాద్ నవంబర్ 16 ప్రజాజ్యోతి వికారాబాద్ జిల్లా బషీరాబాద్ గ్రామానికి చెందిన ఔషేటి సాయి కుమార్ (హోటల్ రాములు కుమారుడు) న్యాయవాదిగా అధికారికంగా ఎన్‌రోల్ అయ్యారు. హైదరాబాద్‌లోని పదాల రామారెడ్డి లా కళాశాలలో, ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో ఐదేళ్ల బి.ఏ. ఎల్.ఎల్.బి. న్యాయవిద్యను విజయవంతంగా పూర్తి చేశారు.చిన్ననాటి నుంచి న్యాయవాదిగా ఎదగాలనే లక్ష్యంతో కృషి చేసిన సాయి కుమార్, ఐదేళ్ల సుదీర్ఘ విద్యాభ్యాసం అనంతరం తన కలను సాకారం చేసుకున్నారు. తమ కుటుంబంలో తొలి న్యాయవాదిగా నిలిచి ప్రత్యేక గుర్తింపు సాధించడం విశేషం.ఈ సందర్భంగా తండ్రి రాములు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో న్యాయరంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి, పేదలు, బలహీన వర్గాలు మరియు సామాన్య ప్రజలకు న్యాయసేవలు అందించాలని ఆకాంక్షించారు.

నూతన గృహప్రవేశానికి హాజరైన పంజుగుల బ్రదర్స్ కు ఘన స్వాగతం





బషీరాబాద్, నవంబర్ 16 (ప్రజా జ్యోతి): వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు వేణు పట్వారి నూతన గృహప్రవేశ వేడుక ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ తాండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీశైల్ రెడ్డి పంజుగుల, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తండ్రి పంజుగుల విఠల్ రెడ్డి హాజరై వేణు పట్వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.గ్రామానికి చేరుకున్న నాయకులకు వేణు పట్వారి డప్పుచప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నాయకులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బషీరాబాద్ మండల అధ్యక్షుడు పంజుగుల నర్సిరెడ్డి (రాజన్న), సర్పంచ్ పాండురంగారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, జంగం వీరయ్య, నరేందర్ రెడ్డి, కృష్ణ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిపూర్ నరసింహులు, శ్రీనివాస్ చారి, దామెర్చేడ్ శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెల్జాల్ లో ఆసరా,వికలాంగుల పెన్షన్ పత్రాల పంపిణీ



తలకొండపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆసరా,వికలాంగుల పెన్షన్ పత్రాలను వెల్జాల్ గ్రామంలో ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు సోమవారం గ్రామ సర్పంచ్ వానరాసి రాములమ్మ ఏమ్/ఓ వెంకటేష్ గ్రామ నాయకులతో కలిసి అందజేయడం జరిగింది.ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్ పేద,వృద్ధులు, వితంతువులు,వికలాంగులకు ఎంతో అండగా నిలుస్తోందిని ఆయన తెలిపారు.నెల నెలా అందే ఈ పెన్షన్ తో ఎంతో మంది కుటుంబాలు నడుస్తున్నాయని పేర్కొన్నారు.ముఖ్యంగా వికలాంగులకు ఈ పింఛన్ ఒక భరోసా లాంటిదని గుర్తు చేశారు.అలాంటి పెన్షన్ పత్రాలను సర్పంచ్ స్వయంగా ఇంటింటికి వెళ్లి అందించడం గ్రామస్తులకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని గ్రామస్తులు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ఐలూ ఊర్మిళ,వింజమూరు శ్రీను,ఆసిఫ్ లకు పెన్షన్ పత్రాలను అందజేశారు.పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి,సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ శివవిజయలక్ష్మి ,విజయకుమార్,పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్,కారోబార్లు వడ్ల రవి,చంద్రకళ,ఐల్ రంగయ్య,లక్ష్మీ దేవి,పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

కానుగుల శ్రీశైలం మృతిపై ఖానాపూర్ లో విషాదఛాయలు

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆమనగల్ మున్సిపల్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము



తలకొండపల్లి,నవంబర్ 16 (ప్రజాజ్యోతి) తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన కానుగుల శ్రీశైలం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు.శ్రీశైలం కుటుంబానికి అండగా నిలిచే వ్యక్తి.కుటుంబ భారాన్ని తన భుజాలపై మోస్తూ,కష్టపడి పని చేస్తూ కుటుంబాన్ని ముందుకు నడిపిస్తున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం అతని ప్రాణాలను బలి తీసుకుంది.ఈ వార్త వినగానే ఖానాపూర్ గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది.ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.కుటుంబ సభ్యుల రోదనలు అందరి హృదయాలను కలచివేశాయి.ఈ విషాద విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు ఆమనగల్ మున్సిపల్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.శ్రీశైలం పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,తన వంతు ఆర్థిక సాయం అందజేసి,అనంతరం వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు చిత్తరంజన్,దాసు,పూసల భాస్కర్,శ్రీను నాయక్,రాకేష్ తదితరులు ఉన్నారు.

ఫోర్ట్యూన్ ఎన్‌క్లేవ్ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి..

నాణ్యతలో రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం!



అల్వాల్ నవంబర్ 16 (ప్రజా జ్యోతి) మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్థానిక నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు 189వ డివిజన్ యాప్రాల్ పరిధిలోని కౌకూర్ ఫోర్ట్యూన్ ఎన్‌క్లేవ్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ మరియు స్టార్మ్ వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండారి లక్ష్మణ్ యాదవ్ సమక్షంలో పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల పురోగతిని పరిశీలించగా, డ్రైనేజీ పైప్‌లైన్ దెబ్బతిన్నట్లు గుర్తించారు. వెంటనే స్పందించిన నాయకు ఎం ఎం సి అధికారులైన డీఈ పద్మలత, ఏఈ సత్యలక్ష్మిలకు సమాచారం అందించారు. దీంతో అధికారులు పనులు జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. దెబ్బతిన్న డ్రైనేజీ పైప్‌లైన్‌ను వెంటనే మరమ్మతు చేసి, నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కోరారు.దనిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు భాస్కర్, మల్లేష్, వెంకట గౌడ్‌తో పాటు పలువురు కాలనీ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, సతీష్, నరేష్, శ్రీకాంత్, కొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా, ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నిరంతరం కృషి చేస్తామని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

త్వరలో ప్రారంభం కానున్న రైస్ మిల్, పెట్రోల్ బంక్

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం

రెండు నెలల్లో రైస్ మిల్ అందుబాటులోకి

సొసైటీ చైర్మన్ కరుణ అజయ్ ప్రసాద్





బషీరాబాద్, నవంబర్ 16, ప్రజాజ్యోతి: వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గి సొసైటీ కార్యాలయంలో సోమవారం సొసైటీ చైర్మన్ కరుణ అజయ్ ప్రసాద్ ఆధ్వర్యంలో పాలకవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో వరి పండించే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరలో రైస్ మిల్, పెట్రోల్ బంక్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.రైస్ మిల్లుకు సంబంధించిన కొన్ని పనులు పూర్తికాకపోవడంతో ప్రారంభం ఆలస్యమైందని పేర్కొన్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. మిగిలిన పనులకు సంబంధించి పాలకవర్గం తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించి, పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.సుమారు రూ. 2 కోట్ల ఒక లక్షతో రైస్ మిల్ నిర్మాణ పనులు చేపట్టామని, దీనికి ప్రతి సంవత్సరం రూ. 23 లక్షల చొప్పున వాయిదాలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి రెండు నెలల్లో రైస్ మిల్లును రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని పెట్రోల్ బంక్ పనులు కూడాజరుగుతున్నాయి త్వరలో పూర్తిచేసి మండల ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామని కరుణ అజయ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ వెంకటయ్య డైరెక్టర్స్ విష్ణువర్ధన్ రెడ్డి నర్సింలు చంద్రశేఖర్ బాలకృష్ణ కాశిరెడ్డి హనుమంత్ రెడ్డి ఫయాజ్ కళావతి లక్ష్మి భాయ్ సొసైటీ సిబ్బంది బందప్ప ఫారుక్ రాజశేఖర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana.
Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com

అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

మొయినాబాద్ మున్సిపాలిటీ, మండల గ్రామాల లబ్ధిదారులకు కార్డుల అందజేత







మొయినాబాద్: నవంబర్ 16 (ప్రజా జ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు మొయినాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని ప్రతి గ్రామం నుంచి ఐదుగురు లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిత్యావసర సరుకులు మరింత పారదర్శకంగా అందే అవకాశం ఉంటుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. డిజిటల్ విధానం ద్వారా రేషన్ కార్డుల నిర్వహణ సులభతరం కావడంతో పాటు లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందుతాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ షాబాద్ సోనియా దర్శన్, వైస్ చైర్మన్ గరుగు రాజు ముదిరాజ్, కౌన్సిలర్లు కర్రోల శ్రీధర్, గడ్డం లక్ష్మి వెంకట్ రెడ్డి, గునుగుర్తి శిరీష కిరణ్, చదువు శ్రీలత రామచందర్ ముదిరాజ్, కాంట్రావత్ ప్రియాంక రమేష్ పాల్గొన్నారు. అలాగే సర్పంచులు గొడుగు యాదయ్య, మద్యపాగు కృష్ణ, మల్కాపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

6 సంవత్సరాల కొత్త పెన్షన్ల మంజూరు.. కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదలకు భరోసా

నూతన చేయూత పెన్షన్ పత్రాలు పంపిణీ చేసిన 12వ వార్డు కౌన్సిలర్ అవురం విక్రమ్ రెడ్డి





మొయినాబాద్: నవంబర్ 16 (ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలకు నూతన పెన్షన్లు మంజూరు చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని 12వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు అవురం విక్రమ్ రెడ్డి అన్నారు. నూతన చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అవురం విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ... గత దాదాపు ఆరు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఒక్కరికీ కూడా నూతన పెన్షన్లు మంజూరు కాలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్లు అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ప్రజల కష్టాలను గుర్తించి, వారి అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని, ప్రతి నెలా అందే పెన్షన్‌తో వారి జీవనానికి ఆర్థిక భరోసా లభిస్తుందని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. నూతన పెన్షన్లు మంజూరు కావడం పట్ల వార్డు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అవురం విక్రమ్ రెడ్డి తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు.

జర్నలిస్టులకు ప్రత్యేక పింఛన్, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

ప్రకటనల ఆదాయంలో 10 శాతం వాటా కేటాయించాలి..

ప్రభుత్వమే అదనంగా 3 శాతం నిధులు సమకూర్చాలి

మేడ్చల్ జిల్లా రెవిన్యూ అధికారి మాలతికి టి.ఎస్.జే.యూ వినతి

మేడ్చల్, నవంబర్ 16: రాష్ట్రంలోని జర్నలిస్టులకు శాశ్వత సామాజిక భద్రత కల్పించడంతో పాటు, పదవీ విరమణ అనంతరం ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రత్యేక జర్నలిస్టు పింఛన్, సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్‌జేయూ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు నేషనల్ జర్నలిస్ట్ యూనియన్ ఎన్ యుజె (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ శాశ్వత పింఛన్ పథకం అమలు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి, సానుకూల నిర్ణయం తీసుకునేలా సిఫారసు చేయాలని ఆమెను కోరారు. ఈ సందర్భంగా మెరుగు చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతోపాటు ప్రభుత్వ దృష్టికి ప్రజల ఇబ్బందులను తీసుకెళ్లడంలో వారు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పత్రికలు, స్థానిక మీడియా సంస్థల్లో పని చేస్తున్న అనేక మంది జర్నలిస్టులు పదవీ విరమణ అనంతరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వృద్ధాప్యంలో వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ, జీవన భద్రత కోసం వారికి శాశ్వత భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. టీఎస్‌జేయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ వార్తాపత్రికలు, టెలివిజన్ ఛానళ్లు, మీడియా సంస్థలకు వచ్చే అర్హత కలిగిన ప్రభుత్వ, ప్రభుత్వ రంగ ప్రకటనల ఆదాయంలో 10 శాతం మొత్తాన్ని జర్నలిస్టుల పింఛన్, సంక్షేమ నిధికి కేటాయించాలని కోరారు. దీనికి అదనంగా తెలంగాణ ప్రభుత్వం తన వంతుగా మరో 3 శాతం నిధులను సమకూర్చాలని కోరారు. ఈ విధంగా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తే జర్నలిస్టులకు దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించవచ్చని పేర్కొన్నారు. టీఎస్‌జేయూ రాష్ట్ర నాయకులు, తెలుగు ప్రభ జిల్లా ప్రతినిధి చాప రవీందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల పింఛన్, సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణకు ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసి పారదర్శకంగా లెక్కలు నిర్వహించాలని, ఏటా ఆడిట్ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులతోపాటు పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు సైతం వర్తించేలా సమగ్ర పింఛన్ పథకాన్ని రూపొందించాలని కోరారు. ఈ పథకం అర్హతలు, పింఛన్ మొత్తం, అమలు విధివిధానాలను రూపొందించేందుకు సీనియర్ సంపాదకులు, అనుభవజ్ఞులైన జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్న, మధ్య, పెద్ద వార్తాపత్రికలు, వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఎలాంటి సంఘపరమైన వివక్ష లేకుండా సమాన అవకాశాలు



కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించి ముఖ్యమంత్రి, సంబంధిత ప్రభుత్వ శాఖలకు సిఫారసు చేయాలని ఆమెను కోరారు. జర్నలిస్టుల కోసం జర్నలిస్టులే.. జర్నలిస్టుల సంక్షేమం కోసం సమిష్టి పోరాటం అనే నినాదంతో జర్నలిస్టులందరికీ సామాజిక భద్రత కల్పించేందుకు ఈ ప్రయత్నం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్‌జేయూ) నాయకులు బివిఎస్ చలపతి నాయుడు, పలుగుల పవన్, బుడంపల్లి నిరంత గౌడ్, ఎం. విష్ణు మోహన్, వెంకటాపురం రవి తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేసి కరువు నష్టపరిహారం ఇవ్వాలి

ఎంఏఓకు వినతి అందజేసిన పలువురు ఫార్మా రైతులు

ఆన్లైన్లో రైతుల పేర్లు తొలగించి టీజీఐఐసీ పేరున నమోదు

ఫార్మాసిటీ ఉద్యమ సమన్వయకర్త కవుల సరస్వతి

పరిహారం జాబితాలో రైతుల పేర్లు నమోదు చేయాలి

రైతులంతా లబ్ధి పొందేలా డిజిటల్ సర్వే నిర్వహణ


మండల వ్యవసాయ అధికారి రవినాథ్



యాచారం, నవంబర్ 16 (ప్రజాజ్యోతి): కరువు మండలం గా ప్రకటించినా కరువు పంటల నమోదులో రైతుల పేర్లు నమోదు అయ్యాయా లేదా అని పలువురు ఫార్మా బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఫార్మా బాధిత రైతులు కరువు పరిహారం లబ్ధిని పొందలేరని వచ్చిన వదంతుల నేపథ్యంలో సోమవారం ఫార్మసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో పలువురు రైతులు మండల వ్యవసాయాధికారి రవినాథ్ ను కలసి వినతి పత్రం అందజేశారు. ఫార్మాసిటీ ఉద్యమ సమన్వయకర్త కవుల సరస్వతి మాట్లాడుతూ.. కోర్టు కేసులో ఉన్న రైతుల పేర్లు ఆన్లైన్లో నమోదు కాని రైతుల పేర్లు కరువు పరిహారం జాబితాలో నమోదయ్యాయా లేదా అడిగి తెలుసుకున్నారు. గత ఆర్డిఓ.. ఆన్లైన్ లో రైతుల పేర్లని అక్రమంగా తొలగించి టీజీఐఐసీ పేరునా నమోదు చేశారని పేర్కొన్నారు. కరువు గురించి సర్వే చేసి నష్ట పరిహారం ఇవ్వాలని లేనిచో కోర్టు దిక్కరణ అవుతుందని ఎంఏఓ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంఏఓ మాట్లాడుతూ..గ్రామాల్లో కేటాయించిన వాలంటీర్ల ద్వారా డిజిటల్ సర్వే చేపడుతున్నారని క్రమం తప్పకుండా రైతుల పంటలు నమోదు చేస్తారని తెలిపారు. ఆన్లైన్ రికార్డులో పేర్లు ఉన్న రైతులందరికి డిజిటల్ సర్వే చేస్తున్నామని త్వరలో సర్వే రిపోర్ట్ విడుదల చేస్తామన్నారు. గతంలో కూడా రైతులంతా కరువు పరిహారం లబ్ధిని పొందారని గుర్తు చేశారు.

ప్రత్యేక అభిషేక పూజలో పాల్గొన్న ముద్దం నర్సింహ యాదవ్

ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థన



బోయిన్‌పల్లి, నవంబర్ 16 (ప్రజా జ్యోతి): ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆర్.ఆర్. నగర్‌లో ఉన్న శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో పెంటయ్య, గణేశ్, బుర్రి యాదగిరి, నర్సింగ్, మోహన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ నగర్ ఛట్ పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ అధికార ప్రతినిధి సొంటిరెడ్డి పున్నారెడ్డి



కుత్బుల్లాపూర్ నవంబర్ 16(ప్రజా జ్యోతి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రోడామేస్త్రి నగర్ డివిజన్ లో గల లెనిన్ నగర్ చట్ పూజా కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొని , సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించిన టీపీసీసీ అధికార ప్రతినిధి సొంటిరెడ్డి పున్నారెడ్డి ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంర్ఫ్) చెక్కులు అందజేసిన కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్ నవంబర్ 16(ప్రజా జ్యోతి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంర్ఫ్) ద్వారా శస్త్రచికిత్సలు, వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు పత్రాలు (చెక్కులు) అందజేశారు సీఎంర్ఫ్ ద్వారా ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారుల వివరాలు:

1. బుల్లె ఐలయ్య -- రూ. 60,000
2. గొల్ల మల్లేష్ -- రూ. 30,000
3. ఎస్. రవి బాబు -- రూ. 45,000
4. కాసారానేని శేషగిరి రావు -- రూ. 60,000
5. నూర్ మహమ్మద్ -- రూ. 40,000
6. మహమ్మద్ యాకుబీ -- రూ. 51,000మొత్తం మంజూరైన ఆర్థిక సహాయం: రూ. 2,86,000.

ఈ సందర్భంగా నాయకులుమాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సలు పొందలేని నిరుపేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమం, ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం



నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ పండరి రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మా రెడ్డి, రషీద్, ప్రసన్న కుమార్, డప్పు నరేందర్, మహమ్మద్ గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ నవంబర్ 16(ప్రజా జ్యోతి) కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ షాపూర్ నగర్ నివాస కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా వివాహ శుభకార్యాలు, అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాలకు ఆహ్వాన పత్రికలు అందజేయడంతో పాటు, మంచినీరు, డ్రైనేజీ, అంతర్గత రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కూన శ్రీశైలం గౌడ్ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి కొన్ని సమస్యలను పరిష్కరించగా, మిగిలిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

అయ్యప్ప మాలధారణతో వస్తే స్కూల్లోకి అనుమతి లేదా?

సెయింట్ మార్టిన్ స్కూల్ యాజమాన్యంపై ఏబీవీపీ ఆగ్రహం.. పాఠశాల ఎదుట ధర్నా!

బాలానగర్ నవంబర్ 16(ప్రజా జ్యోతి) అయ్యప్ప మాలధారణ చేసుకున్న విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించకుండా అడ్డుకోవడంపై బాలానగర్ పరిధిలోని సెయింట్ మార్టిన్ హైస్కూల్ యాజమాన్యంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. విద్యార్థులు అయ్యప్ప మాల ధరించి పాఠశాలకు రావడంతో వారిని లోపలికి అనుమతించేందుకు యాజమాన్యం నిరాకరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు సైతం ఈ నిరసనలో పాల్గొని పాఠశాల యాజమాన్య వైఖరిని ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల మధ్య కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టడమే సెయింట్ మార్టిన్ పాఠశాల యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ, సమానత్వం, సోదరభావం నేర్పించాల్సిన విద్యాసంస్థలే ఇలాంటి వివాదాలకు కారణం కావడం బాధాకరమని మండిపడ్డారు. విద్యార్థులు తమ ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా అయ్యప్ప మాలధారణ



చేసుకుంటే పాఠశాలలోకి అనుమతించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యాసంస్థల్లో విద్యార్థులందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని స్పష్టం చేశారు. మత విశ్వాసాలు, ఆచారాల పేరుతో విద్యార్థుల పట్ల వివక్ష చూపడం తగదని హెచ్చరించారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన పాఠశాల యాజమాన్యం వివక్షకు తావిచ్చేలా వ్యవహరిస్తే సహించేది లేదని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం వెంటనే స్పందించి, విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించక పోవడానికి గల కారణాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల ఆత్మగౌరవం, ఆధ్యాత్మిక విశ్వాసాలకు భంగం కలగకుండా చూడాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.విద్యాబుద్ధులు నేర్పాల్సిన విద్యాసంస్థల్లోనే వివక్షకు తావిస్తే ఎలా? అన్న ప్రశ్న ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

వరి గడ్డిని కాల్చితే భూమి సారం తగ్గుతుంది



మొయినాబాద్: నవంబర్ 16 (ప్రజా జ్యోతి) వరి కోత అనంతరం పొలాల్లో మిగిలే వరి గడ్డిని కాల్చకుండా భవిష్యత్తు అవసరాల కోసం భద్రపరచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వరి గడ్డి వ్యర్థం కాదని, రైతులకు అనేక విధాలుగా ఉపయోగపడే విలువైన సంపద అని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం, వాతావరణ పరిస్థితుల్లో అనిశ్చితి కారణంగా భవిష్యత్తులో పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో వరి గడ్డిని వృథా చేయకుండా నిల్వ చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. వరి గడ్డిని పశువులకు మేతగా ఉపయోగించడంతో పాటు కంపోస్ట్ సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించుకోవచ్చని సూచించారు. అలాగే పొలాల్లో నేల తేమను కాపాడేందుకు మల్చింగ్‌గా, పుట్టగొడుగుల సాగులోనూ ఉపయోగించుకోవచ్చని వివరించారు. వరి గడ్డిని పొలాల్లో కాల్చడం వల్ల భూమికి తీవ్ర నష్టం కలుగుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. నేలలోని సేంద్రియ కర్బనం తగ్గిపోవడంతో పాటు పంటలకు మేలు చేసే మిత్ర సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు. నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి కీలక పోషకాలు నష్టపోతాయని పేర్కొన్నారు. గడ్డి కాల్చడం వల్ల వెలువడే పొగతో వాయు కాలుష్యం పెరిగి ప్రజలకు శ్వాసకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. కావున రైతులందరూ పంట అవశేషాలను కాల్చకుండా సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ముఖ్యంగా భవిష్యత్తులో పశుగ్రాస అవసరాలను దృష్టిలో ఉంచుకుని వరి గడ్డిని భద్రపరచుకోవాలని సూచిస్తోంది. పర్యావరణ పరిరక్షణతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ప్రతి రైతు భాగస్వాములు కావాలని అధికారులు కోరుతున్నారు.

మల్లారెడ్డి గూడపై గూడూరు గ్రామము సూపర్ విక్టరీ.. సిల్వర్ కప్ కైవసం

6 పరుగుల తేడాతో గూడుర్ ఘనవిజయం సాధించింది

24 జట్ల మధ్య జరిగిన టోర్నీలో ఛాంపియన్‌గా గూడూర్ జట్టు

విజేతలను అభినందించిన సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా

విజేతలకు గ్రామంలో ఘన స్వాగతం.. డప్పు వాయిద్యాలతో భారీ ర్యాలీ





కొత్తూరు నవంబర్ 16 (ప్రజా జ్యోతి) రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం పరిధిలోని వెంకపల్లి ఎం.వి.ఆర్ గార్డెన్‌లో గత కొన్ని రోజులుగా ఉత్కంఠభరితంగా సాగిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ఘనంగా ముగిసింది. చుట్టుపక్కల 24 గ్రామాలకు చెందిన జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో గూడూరు గ్రామ క్రికెట్ జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో మల్లారెడ్డి గూడ జట్టుపై 6 పరుగుల తేడాతో ఉత్కంఠభరిత విజయం సాధించి సిల్వర్ కప్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గూడూరు జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత ఓవర్లలో 156 పరుగులు సాధించింది. అనంతరం 157 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన మల్లారెడ్డి గూడ జట్టును గూడూరు బౌలర్లు సమర్థవంతంగా కట్టడి చేశారు. చివరి ఓవర్,చివరి బంతి వరకు నువ్వా నేనా అన్నట్లు సాగిన పోరులో గూడూరు జట్టు 6 పరుగుల తేడాతో విజయం సాధించింది.ఈ విజయానికి గూడూరు జట్టు కెప్టెన్ అలీ భాయ్ నాయకత్వం కీలకంగా నిలిచింది. సమయోచిత నిర్ణయాలు, బౌలర్లను సమర్థవంతంగా వినియోగించుకోవడం జట్టు విజయానికి దోహదపడ్డాయి. జట్టులోని ప్రతి ఆటగాడు సమష్టిగా రాణించి గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారు. విజేత గూడూరు జట్టు సభ్యులు:లి అలీ భాయ్ (కెప్టెన్), సలీం బాయ్, అభి, జయ్ రెడ్డి, అరవింద్ గౌడ్, శ్రీధర్, నరేందర్ రెడ్డి, గణేష్, బన్నీ, బాలు, క్రాంతి, జాన్, సుధాకర్ రెడ్డి, కుమార్. గ్రామంలో ఘన స్వాగతం టోర్నమెంట్‌లో విజయం సాధించి గ్రామానికి చేరుకున్న గూడూరు జట్టుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మెయిన్ రోడ్డుపై డప్పు వాయిద్యాలు, కేరింతలు, యువత ఉత్సాహంతో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా మాట్లాడుతూ.. 24 గ్రామాల జట్ల మధ్య జరిగిన పోటీలో గూడూరు యువకులు అద్భుత ప్రతిభ కనబరిచి 6 పరుగుల తేడాతో కప్ గెలుచుకోవడం గ్రామానికి ఎంతో గర్వకారణమన్నారు. ఈ విజయం యువతలోని ఐకమత్యం, క్రమశిక్షణ, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటారని తెలిపారు. క్రికెట్ వంటి క్రీడలు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, ఓటమిని తట్టుకునే ధైర్యాన్ని నేర్పుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ యువకులు ఇలాంటి విజయాలు సాధించి గ్రామానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామ పంచాయతీ తరఫున యువతకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ విజయోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేత జట్టును అభినందించారు.

ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన సర్పంచ్ లలిత గోపాల్ నాయక్

హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు






కొత్తూరు నవంబర్ 16 (ప్రజా జ్యోతి) కొత్తూరు మండలంలోని ఇమ్ముల నర్వ గ్రామంలో సర్పంచ్ లలిత గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు,ఉప సర్పంచ్ సిరాజ్ హాజరై భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మంజూరైన లబ్ధిదారులు త్వర త్వరగా ఇండ్లను పూర్తి చేసుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రవికుమార్ గుప్తా,కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రటరీ బాబు ముదిరాజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాసు నాయక్, పెంటన్నోళ్ల ఆంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొర్ర రవి నాయక్,మేక గూడ డైరెక్టర్ సభావాత్ శంకర్ నాయక్, మైనార్టీ సేల్ కొత్తూరు మండల అధ్యక్షుడు కాజా, వార్డు సభ్యులు బిచ్చ నాయక్, సభావత్ రాజన్,రియాజ్, సునీత భూషణ్ కుమార్, కారోబార్ రాజు,సత్తయ్య, రవీందర్,రాములు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీరు సీసతో దాడి

బషీరాబాద్ నవంబర్ 16 ప్రజా జ్యోతి భూతులు తిడుతూ గొడవపడి బీర్ సీసతో కొట్టి రక్త గాయం అయింది ఎస్ఐ విఠల్ తెలిపిన వివరాలప్రకారం సాకలి శ్యామప్ప మైల్వార్ గ్రామం 16 నాడు ఈవినింగ్ నాలుగు గంటల సమయంలో తన పొలం దగ్గర ఉండగా దూల సురేష్ మైల్వార్ గ్రామానికి చెందిన వ్యక్తి పొలం దగ్గర వచ్చి బూతులు తిడుతూ గొడవ పడి బీరుసీసతో కొట్టిరక్త గాయ చేయడం జరిగింది ఇట్టి విషయంపై శ్యామప్పపోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయగా సురేష్ పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధికి దూరం



కాగజ్‌నగర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధి కోసం ఆర్థిక సంఘం నిధులు, వీబీజీరామ్‌జీ, జనరల్ ఫండ్ తదితర నిధులను ఏటా విడుదల చేస్తున్నప్పటికీ సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉంటుంది. కాగజ్‌నగర్ పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్నప్పటికీ కూడా వీటి అభివృద్ధి జరుగడం లేదు. కాగజ్‌నగర్‌కు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దరిగాం సమస్యల వలయంలో ఉం ది. ఈ గ్రామానికి వెళ్లేందుకు కనీస రోడ్డు సౌకర్యం లేదు. మధ్యలోని ఒర్రెలపై వంతెనలు లేవు. ఈ గ్రామానికి చెందిన వారు నిత్యం కాగజ్‌నగర్‌కు రావాలంటే కాలినడకే శరణ్యమవుతోంది.

ఏళ్లుగా సమస్య ఉన్నా..

ఏళ్లుగా ఈ సమస్య ఉన్నప్పటికీ ప్రభుత్వాలు మారుతున్నా ఈ గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించ డం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అత్యవసర పరిస్థితి వస్తే దేవుడిపై భారం వేసి కాలం గడుపాల్సిన పరిస్థితి ఉంది. కాగజ్‌నగర్ చెక్ పోస్టు సమీపం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాపూర్ పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉంది. గ్రామానికి వెళ్లేందుకు వంతెన కూలి పోయి ఇప్పటికీ ఆరు సంవత్సరాలు గడిచింది. చిన్నపాటి వర్షం కురిసిందంటే చాలు గ్రామ సమీ పంలో ఉన్న వాగు పూర్తిగా ఉప్పొంగి పోతోంది. తమకు వంతెన నిర్మించాలని అధికారులకు గ్రామస్తులు వినతి పత్రాలు అందజేశారు. అలాగే నాయకులు, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. అయినా కూడా ఇంత వరకు పరిస్థితి ఏ మాత్రం మారలేదని పలువురు చెబుతున్నారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక పోవడంతో నిత్యం అవస్థలు పడాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

వాంకిడికి వెళ్లే ప్రధాన రహదారిపై..

మండలంలోని అంకుసాపూర్ గ్రామం నుంచి వాంకిడికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో కూడా వంతెన నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే వాంకిడికి ఆసిఫాబాద్ మీదుగా కాకుండా అంకుసాపూర్ మీదుగా మార్గంతో కిలో మీటర్ల మేర తగ్గి దగ్గరగా ఉం టుంది. 2009లో ఈ వంతెనకు నిర్మాణం ప్రారంభిం చారు. ప్రభుత్వాలు మారడం, నిధులు విడుదల చేయక పోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే చేతులె త్తాశారు. దీంతో ఆయా గ్రామాల్లోని వందలాది కుటుంబాలు కాలినడకనే కాగజ్‌నగర్‌కు రావాల్సిన పరిస్థితి. గిరి గ్రామాలు అభివృద్ధి చెందుతాయని గత ప్రభుత్వం ఈ పనులకు రివైజ్ టెండర్లను పిలిచి పనులు ప్రారంభించినప్పటికీ కూడా ఇంకా పిల్లర్ల దశ వీడని పరిస్థితి ఉంది. వర్షాకాలం వచ్చిదంటే ఈ గ్రామాలకు పూర్తిగా రాకపోకలు సాగని పరిస్థితి ఏర్పడింది. కేవలం చలి కాలం, ఎండ కాలం మాత్రమే తాత్కాలి మట్టి రోడ్డు గుండా వెళ్లాల్సి ఉంటుంది.

చిన్నపాటి వర్షం కురిస్తేనే..

చిన్నపాటి వర్షం కురిసిందంటే చాలు పూర్తిగా రోడ్డు కొట్టుకొని పోతోంది. దీంతో వాగు దాటాలంటే కూడా పోలేని పరిస్థితి ఉంది. తమకు శాశ్వత పరిష్కారం చూపాలని పలుమార్లు మొర పెట్టుకు న్నా పరిష్కారం చూపడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గిరి గ్రామాల అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తున్నప్పటికీ నిధులు విడుదల జాప్యం, అధికారులు పట్టింపులేని తనంతోనే సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. మండల పరిధిలోని కోసినిలో కూడా లోలెవల్ వంతెన ఉండడం చిన్న పాటి వర్షం కురిస్తేనే గుట్టలపై నుంచి ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచి పోతాయి. ఇప్పటికీ పలు ప్రమాదాలు జరుగుతున్న కూడా ఈ విషయంలో చర్యలు చేపట్టడం లేదు. రాత్రి వేళల్లో వాగు ఉప్పొంగి ప్రవహిస్తే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం గడుపుతున్నారు. కాగజ్‌నగర్ పట్ట ణ సమీప గ్రామాల పరిస్థితి ఇలా ఉంటే అటవీ ప్రాంత గిరి ప్రాంతాల పరిస్థితి ఏవిధంగా ఉందో ఊహించవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

పింఛన్ల మంజూరు లో టార్గెట్ లేదు.. అర్హతే ప్రామాణికం

కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్

చేయూత పింఛన్ మంజూరు పత్రాలను అందజేసిన మున్సిపల్ కమిషనర్ సాహితి రెడ్డి,సుదర్శన్ గౌడ్



కొత్తూరు నవంబర్ 16 (ప్రజా జ్యోతి) అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పింఛన్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్ అన్నారు. సోమవారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరు పత్రాలను మున్సిపల్ కమిషనర్ సాహితి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ తో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ..దివ్యాంగులు, వితంతువులు,చేనేత కార్మికులు,కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఎంతో ఆసరా అని చెప్పారు. అర్హులైన అబ్దిదారులు నిరాశ చేందకూడదని అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటారని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు జగన్, ఏనుగు జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్,మాజీ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్,కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నవీన్ చారి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయులు గౌడ్,పెద్దిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,పిర్లగూడెం మహేష్ గౌడ్, శివశంకర్ గౌడ్,గోవిందు నాయక్,పాశం కృష్ణ,చింత సాయి తేజశ్వర్,శివ,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా

మైలార్దేవుపల్లిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు

ప్రభుత్వ భూమి ఆక్రమించిన, నిర్మాణాలు చేపట్టిన చర్యలు తప్పవు

రాజేంద్రనగర్ తహసిల్దార్ బొమ్మ రాములు



రాజేంద్రనగర్, నవంబర్ 16 (ప్రజా జ్యోతి) ప్రభుత్వ భూమి ఆక్రమించిన, నిర్మాణాలు చేపట్టిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ తహసిల్దార్ బొమ్మ రాములు హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మైలార్దేవుపల్లిలో సర్వేనెంబర్ 156 ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు రావడంతో సోమవారం రెవెన్యూ అధికారుల ఆదేశాలతో గిరిధరి శ్రీవాణీ, జిపిఓ సాంబరాజు రెవెన్యూ బృందంతో కలిసి జెసిపిల సహాయంతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమిలో ఎవరు అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఆక్రమించిన కఠిన చర్యలు తప్పు అన్నారు. అదేవిధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టి నష్టపోవద్దని సూచించారు. ఎవరైనా ప్రభుత్వ భూమి ఆక్రమించిన నిర్మాణాలు చేపట్టినట్టు తెలిసిన నేరుగా తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యుత్ సమస్యలపై సభ్యుల ఆగ్రహం



దహెగాం : గ్రామాల్లోని విద్యుత్ సమస్యలు, ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు సరి చేయడం లేదని పలువురు సర్పంచ్‌లు విద్యుత్ అధికారులపై మండి పడ్డారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో సోమవారం ఎంపీడీవో నసిరుల్లాఖాన్ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు ఎస్‌భారతి, ఇందిర శంకర్, ప్రవంతి, ఇంద్రక్క మాట్లాడుతూ గ్రామాల్లోని ఇండ్ల మీద ఉన్న విద్యుత్ తీగలను సరి చేయడం లేదని విద్యుత్ శాఖ ఏఈ రవీందర్‌ను ప్రశ్నించారు. గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను గుర్తించి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏఈ. రవీందర్ తెలిపారు. వ్యవసాయ శాఖ సంబంధించిన వివరాలను ఏఈవో లావణ్య చదివి వినిపించారు. లగ్గాం సర్పంచ్ కొండ్ర మహేష్ గౌడ్ గ్రామాల్లో ఇప్పటికే పలు విత్తన వరి కంపెనీలు విత్తనాలు సరఫరా చేశాయని చెప్పారు. రైతులు నారుమల్లు సిద్ధం చేస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఎన్ని గంటలు సరఫరా చేస్తారని ప్రశ్నించారు. ఏఈ రవీందర్ విద్యుత్ సరఫరా వివరాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఏఈవో లావణ్య విత్తన కంపెనీలకు సూచించినప్పటికీ సరఫరా చేస్తున్నారని సమాధానం ఇచ్చారు. రాంపూర్ సర్పంచ్ రాజలింగు మాట్లాడుతూ వంట చెరుకు కోసం వెళ్లిన వారిని అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని చెప్పారు. అదే విధంగా గ్రామంలో ఇళ్లు కట్టుకున్న రహదారులు వేసినా అడ్డుకోవడం సరికాదని తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కె తిరుపతిగౌడ్, ఎంపీవో శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు కార్తీక మాసాన్ని

యాలాల్ నవంబర్ 16 ప్రజా జ్యోతి యాలాల్ మండలంలో జుంటుపల్లి రామస్వామి దగ్గర శివాలయంలో ప్రత్యేక పూజలు పురస్కరించుకుని రెండో సోమవారం సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి పరమశివుడిని దర్శించుకోనున్నారు.



ఆలయంలో ప్రత్యేక రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు శివనామస్మరణ చేస్తూ భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొననున్నారు. ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడనున్నాయి.హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో శివాలయం మారుమోగనుంది ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రాజస్వామి ఆధ్వర్యంలో ఘనంగా భక్తులు తరలివచ్చారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి



ఆసిఫాబాద్ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కె హరిత అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, డీఆర్వో వేణులతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని నౌగంబస్తీకి చెందిన పోచమ్మ తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయలని దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ పట్టణం నూర్‌నగర్‌కు చెందిన జగన్నాథ్ తన పిల్లలు తన ఆస్తిని మొత్తం తీసుకొని తన పోషణ పట్టించుకోవడంలేదని తన ఆస్తిని తనకు అప్పగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వాంకిడి మండలం బెండార గ్రామానికి చెందిన హరిక తనకు ఆశ వర్కర్‌గా ఉపాధి కల్పించాలని దరఖాస్తు అందజేశారు. సిర్పూర్(యూ) మండలం పాములవాడ గ్రామానికి చెందిన ఆత్రం అర్జుబాయి తనకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ పట్టణం బాలాజీనగర్‌కు చెందిన స్వప్న తనకు రెండు పడకల గదుల ఇళ్లు కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. కెరమెరి మండలం చౌపన్‌గూడ గ్రామానికి చెందిన గిరిజనులు తమ వ్యవసాయభూములకు బావులు, బోరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని అర్జీ సమర్పించారు.
కలెక్టరేట్‌లో సాదారణ ప్రజావాణి కార్యక్రమంతో పాటు పిల్లల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో పిల్లలు తమతమ సమస్యలను ప్రజావాణిలో అదికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, అదనపు గదుల నిర్మాణం, మూత్రశాలలు నిర్మించాలని అర్జీ సమర్పించారు. మండలంలోని వావుదాం గ్రామానికి చెందిన విద్యార్థులు తమ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం, తాగునీరు, వంటశాల, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అర్జీ సమర్పించారు. చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన అచ్యుతవల్లి అనే 6వ తరగతి విద్యార్థిని తనకు కరీంనగర్ జిల్లా చింతకుంటలో గల సాంఘిక సంక్షేమ పాఠశాలలో సీటు వచ్చిందని తనకు దూరం అవుతున్నందున జిల్లాలో ఏదైన గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని దరఖాస్తు అందజేసుకున్నది. పిల్లల ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.